హైదరాబాద్ వార్త



# మజ్లిసేతర ప్రాంతాల్లో ప్రజలకు అన్యాయం

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, నవంబర్ 10, ప్రభాతవార్త:** నాంపల్లి నియోజకవర్గంలో అనేక సంవత్సరాలుగా మజ్లిస్ పార్టీ నేతృత్వం వహిస్తోందని, మజ్లిసేతర ప్రాంతాల్లో ప్రభుత్వం నుండి ఎటువంటి సహకారం అందకుండా అడ్డుకుంటూ, ప్రజలకు అన్యాయం చేస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం నాంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో ఆయన అభివృద్ధి పనులను లాంఛనంగా ప్రారంభించారు. అందులో భాగంగా ఆసిఫ్‌నగర్ డివిజన్‌లోని దయాబాగ్‌లోని కమ్యూనిటీహాల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మజ్లీస్ కార్పొరేటర్‌లు,ఎమ్మెల్యేలు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పార్లమెంట్ సభ్యుడిగా నిర్లక్ష్యానికిగురైన ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌ల సాయంతో సుమారు 78 లక్షలతో కమ్యూనిటీ హాళ్లు, ఓపెన్ జిమ్‌లు, బోర్‌వెల్స్ వంటి అనేక అభివృద్ధి పనులను ప్రారంభించామని తెలిపారు. హైదరాబాద్ నగరంలో జీహెచ్‌ఎంసీ,వాటర్‌వర్క్స్ డిపార్ట్‌మెంట్‌కు నిధుల కొరత వేధిస్తోందని, కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వని కారణంగా కొత్త టెండర్లు తీసుకునే పరిస్థితి లేదని అన్నారు. వీధి లైట్లు హ్యాండిల్ చేసే సిబ్బందికి కూడా జీతాలు ఇవ్వటం లేదని, దీంతో సమ్మెకు దిగారని గుర్తుచేశారు. నగరంలో అనేక ప్రాంతాలలో నిధుల కొరత వల్ల ప్రజలకు అన్యాయం జరుగుతోందని, నిధుల కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. అనంతరం బీజేపీ సీనియర్ నాయకుడు మాజీ కార్పొరేటర్ దేవర కరుణాకర్ 60వ జయంతి సందర్భంగా గుడిమల్కాపూర్ డివిజన్‌లో క్రికెట్ టోర్నమెంట్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో బీజేపీ కార్పొరేటర్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణలో కళలకు విశేష ప్రోత్సాహం

### ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నిర్మలజగ్గారెడ్డి



సన్మానితులు, పురస్కారాలు పొందిన చిన్నారి కళాకారులు, గురువులతో నిర్మల జగ్గారెడ్డి, మధుకర్, మల్లేష్, ధ్రువ తదితరులు

**నాంపల్లి, నవంబరు 10 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రం కళలకాణాచిగా విరాజిల్లుతోందని, తెలంగాణ ప్రజాప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, సంగీత నాటక అకాడమీ తదితర సంస్థల ద్వారా ఎన్నోరకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్విరామంగా నిర్వహిస్తూ కళలను, కళాకారులను విశేషంగా ప్రోత్సహిస్తూ గుర్తింపు పొందడానికి, తగిన అవకాశాలు లభించేలా చర్యలు తీసుకుంటోందని, రాష్ట్ర వ్యాప్తంగా కళాసంస్థలకు సౌజన్యం అందిస్తూ ఎంతగానో ప్రోత్సహిస్తోందని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి తెలిపారు. యువత, కళాకారులు విద్యతోపాటు కళలను నేర్చుకొని, అవకాశాలను సద్వినియోగం చేసుకొని అత్యుత్తమ కళాకారులను పేరుప్రఖ్యాతులు పొందాలని సూచించారు. పిల్లలు కేవలం చదువుతో సంపూర్ణ జ్ఞానం పొందలేరని, సమాజంపట్ల అవగాహన, కళలపట్ల ఆసక్తి కూడా ఉండాలని, అప్పుడే సామాజిక రుగ్మతలు దూరమై మానసిక పరిపక్వతతో సర్వతోముఖాభివృద్ధి దిశగా పయనిస్తారని బి.మధుకర్ అనగా పిల్లల్లో ఉన్న సృజనాత్మకత పెరగడానికి కళలు, లలితకళలు.... అందులో సంగీతం, నాట్యం ప్రధాన భూమిక పోషిస్తాయని డా. మల్లేష్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో నృత్యభారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ డ్యాన్సెస్, సంగారెడ్డి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో 160మంది బాలలతో అంగరంగ వైభవంగా నిర్వహించిన నృత్యభారతి బాలోత్సవ్-2024కు ముఖ్యఅతిథిగా విచ్చేసిన నిర్మల జగ్గారెడ్డి విశిష్ట అతిథులు సినీనిర్మాత, కథానాయకుడు ధ్రువవాయు, బొల్లంపల్లి మధుకర్, సంస్థ డైరెక్టర్ డా. మల్లేష్ తదితరులతో కలిసి నాట్యగురువులు ఇందిరా పరాశరం, రమణిసిద్ధి, రాజేశ్వరి శ్రీధర్, మౌనిక, విశాఖ ప్రకాష్, మాధవిశర్మ, మౌనిక, జి.రవిలను ఘనంగా సత్కరించి నృత్యభారతి బిరుదుతో పురస్కారాలను ప్రదానంచేసి ప్రదర్శనల్లో పాల్గొన్న బాలలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

శ్రీశైలం రహదారిలో ఘోర రోడ్డు ప్రమాదం

## అదుపు తప్పి పల్టీలు కొట్టిన కారు

ఇద్దరు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు

**సరూర్‌నగర్, నవంబరు 10 ప్రభాతవార్త:** శ్రీశైలం రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్ శివారు ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన కందుకూరు ఫార్మాసిటీ పిఎస్ పరిధిలోని శ్రీశైలం రహదారిలో జరిగింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. పహాడీ షరీఫ్, ఉమర్ కాలనీకి చెందిన మహ్మద్ నయాబ్ ఖాన్ (18), ఇంతియాజ్ ఖాన్ (19)లు స్నేహితులతో కలిసి రెండు కార్లలో ఆదివారం తెల్లవారు జామున శ్రీశైలం డామ్ చూడడానికి బయలు దేరారు. అయితే ఓ కారు అతివేగంతో అదుపు తప్పి ఫార్మా సిటీ పిఎస్ పరిధిలో శ్రీశైలం జాతీయ రహదారిపై పల్టీలు కొట్టి బోల్తా పడింది. దీంతో కారులో ఉన్న నయాబ్, ఇంతియాజ్‌లు సంఘటనా ప్రదేశంలోనే మృతి చెందారు. కారులోని మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో సంఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ఆసుపత్రికి పంపికి, మృతదేహాలను మార్చురీకి పంపి కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే నయాబ్, ఇంతియాజ్‌లు మృతి చెందడంతో పహాడీషరీఫ్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబాలను పోషించే వారు మృతి చెందడంతో వారి కుటుంబాల్లో ఆందోళన వ్యక్తమైంది.

## టివి మెకానిక్ దారుణ హత్య

**మైలార్‌దేవ్‌పల్లి, నవంబరు 10 ప్రభాతవార్త :** అప్పు విషయంలో జరిగిన గొడవలో ఓ టివి మెకానిక్ దారుణ హత్యకు గురైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం.....వట్టెపల్లి ప్రాంతానికి చెందిన సైఫ్ అలియాస్ సాబేర్ (38) వృత్తి రీత్యా టివి మెకానిక్.కాగా గౌస్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇస్మాయిల్ టివి మెకానిక్ సైఫ్ అలియాస్ సాబేర్‌లు బావ మరుదుళ్లు.సైఫ్ కొంత కాలం క్రితం మహ్మద్ ఇస్మాయిల్‌కు రెండు లక్షల రూపాయలు అప్పుగా ఇచ్చాడు. ప్రతీ రోజు ఆరు వందల రూపాయలు ఇస్మాయిల్ నుంచి సాబేర్ తీసుకుంటున్నాడు. రెండురోజులనుంచి ఇస్మాయిల్ సైఫ్‌కు డబ్బులు చెల్లించటం లేదు. ఈ విషయంలో వారి మధ్య గొడవ జరుగుతున్నది. శనివారం రాత్రి మహ్మద్ ఇస్మాయిల్ సాబేర్ ఇంటికి వచ్చాడు. సైఫ్, మహ్మద్ ఇస్మాయిల్ కలిసి మద్యం సేవించారు.డబ్బుల విషయంలో వారి మధ్య గొడవ జరిగింది.తాగిన మైకంలో కోపంలో ఇస్మాయిల్ ఆదివారం తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో సైఫ్ తలపై బండరాయితో మోదటంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన సైఫ్ మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు.పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం సైఫ్ మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.హత్య చేసిన ఇస్మాయిల్‌ను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అదుపులోకీ తీసుకుని విచారిస్తున్నారు. ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సాలార్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ ఆశిష్ గోయల్

## మ్యూజియంలో ప్రత్యేక చిత్రాల ప్రదర్శన

**చార్మినార్, నవంబరు 10 ప్రభాతవార్త :** సాలార్‌జంగ్ మ్యూజియంలో ఢిల్లీకి చెందిన చిత్రకారుడు, కవి సతీష్‌గుప్తా వేసిన అరుదైన చిత్రాలను ఆదివారం సాలార్‌జంగ్ మ్యూజియంలో ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. సాలార్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ ఆశిష్ గోయల్ ఈ ప్రత్యేక ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం మ్యూజియం డైరెక్టర్ ఎగ్జిబిషన్‌ను తిలకించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాలార్‌జంగ్ మ్యూజియంకు గొప్ప పేరు ఉందని,మ్యూజియంలో పలు అంశాలపై ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నామని, చిత్రకారులను మరింత ప్రోత్సాహిస్తామని తెలిపారు.కాగా ఢిల్లీకి చెందిన ఆర్టిస్ట్ సతీష్ గుప్తా వేసిన శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీదుర్గామాత, శ్రీసరస్వతీ, శ్రీలక్ష్మీమాత, శ్రీ అంజనేయ స్వామితో పాటు పలు అరుదైన కళా ఖండాలు ఎగ్జిబిషన్‌లో ఉన్నాయి.కార్యక్రమంలో ఫిలాంట్‌రో పోస్టు కలెక్టర్ పార్వతీ రెడ్డితోపాటు పలువురు పాల్గొన్నారు.ఈ నెల 20వ తేదీ వరకు మ్యూజియంలో ఎగ్జిబిషన్ కొనసాగుతుంది.

## నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

**నార్సింగి, నవంబర్ 10 ప్రభాతవార్త :** విద్యుత్ లైన్ల మధ్య ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడం కోసం ఈ క్రింది ప్రాంతాలలో నేడు కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నామని ఇబ్రహీంబాగ్ ఏఈ సంతోష్ కుమార్ పేర్కొన్నారు. 11.కేవీ డాలర్‌హిల్స్ ఫీడర్, 33/11కేవీ మణికొండ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10.గంటల నుంచి మధ్యాహ్నం 2.గంటల వరకు శివాజీ నగర్, సెక్రెటేరియట్, సుందర్ గార్డెన్, గోల్డెన్ టెంపుల్, పైప్‌లైన్ రోడ్డు ప్రాంతాలలో కరెంటు సరఫరాను నిలిపి వేస్తున్నామని, ఇందుకు విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలని ఏఈ సంతోష్ కుమార్ వివరించారు.

# వాహన వేగం.. యూ టర్న్...!

### * డ్రైవింగ్ కన్నా.. వెయిటింగే ఎక్కువ * ఒక్కో జంక్షన్‌లో మూడు నిమిషాలు * వాహనదారులపై ఇంధనపు భారం




**హైదరాబాద్, నవంబరు 10 ప్రభాతవార్త**

నగరంలో వాహనదారుడి సగటువేగం గంటకు కేవలం పది కిలోమీటర్లు మాత్రమే. కొన్ని సందర్భాల్లో అదీ అనుమానమే..ట్రాఫిక్‌లో వాహనాలు నడపడంకన్నా, సిగ్నళ్ల వద్ద వెయిటింగ్, అకారణంగా కిలోమీటర్ల కొద్దీ చుట్టూ తిప్పే యూటర్న్‌లతో ఈ దుస్థితి ఏర్పడుతోంది. నగరంలో గంటకు సగటున 20 నుంచి 25 కిలోమీటర్లకు వాహన వేగాన్ని పెంచినట్లు ట్రాఫిక్ ఉన్నతాధికారులు చెబుతున్నా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. భారీ ట్రాఫిక్ జామ్‌లకు తోడు, కొత్తగా పుట్టుకొస్తున్న సిగ్నళ్లు, జంక్షన్లను మూసేసి, ఏర్పాటుచేస్తున్న యూటర్న్‌లతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సిగ్నల్ ఫ్రీ పేరిట జంక్షన్లను మూసేసి యూటర్న్‌లను ఏర్పాటు చేశారు. వీటివల్ల నగరంలోని వాహనాలన్నీ సగటున కిలోమీటర్ ఎక్కువగా తిరుగుతున్నాయని అంచనా. రోజూ 50 లక్షలకు పైగా వాహనాలు 50 లక్షల కిలోమీటర్లు అదనంగా తిరగాల్సి వస్తోంది. చిన్నా పెద్ద వాహనాలను కలిపి సగటున కిలోమీటర్‌కు రూ.5 ఖర్చు అని భావించినా, రూ. 2.5 కోట్ల ఇంధనం యూటర్న్‌ల కారణంగా వృథా అవుతోందని వాహనదారులు అంచనా వేస్తున్నారు. ప్రమాదాల పేరు చెప్పి తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా ఎంత నష్టం వాటిల్లుతుంది వంటి గణాంకాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి న అవసరం ఉందని పేర్కొంటున్నారు. సిబ్బందిని నియమించడంతో పాటు, వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయని సూచిస్తున్నారు. మనం ఓ వైపు ఆగుతాం. ఎదురుగా ఉన్న బల్డింగ్‌లోకి వెళ్లాల్సి ఉంటుంది. ట్రాఫిక్‌లో కిలోమీటర్ మేర ముందుకు ప్రయాణించి, అక్కడ యూటర్న్ తీసుకుని మళ్లీ కిలోమీటర్ వెనక్కి ప్రయాణం చేయాలి. అంటే రెండు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాలి. దీనివల్ల సమయం, ఇంధనం వృథా ఇలాంటి సమస్యను నివారించాలంటే.. కీలక ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ ఏర్పాటు చేయడంతో పాటు రోడ్ల క్రాస్‌చేయడానికి సబ్‌వేలు, స్కైవేలు ఏర్పాటు చేస్తే కొంతమేలు. అయితే, యూటర్న్‌ల వల్ల ప్రమాదాలు తగ్గాయని పోలీసులు చెబుతున్నారు.

హబ్సిగూడ చౌరస్తా- నాచారం, అపోలో ఆసుపత్రి, ఫిలింనగర్ నుంచి జూబ్లీహిల్స్ వెళ్లేందుకు సీవీఆర్ క్రాస్‌రోడ్స్‌లోని సిగ్నల్ వద్ద ప్రతి వాహనదారుడు కనీసం 10 నిముషాలు వేచి చూడాల్సిందే. బంజారాహిల్స్, తెలంగాణ భవన్ వరకు ట్రాఫిక్ జాం అవుతోంది. ఆటోమేటిక్ సిగ్నల్‌తో పాటు ట్రాఫిక్ సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు. కానీ వాహనదారుల సమస్యను పరిష్కరించలేకపోతున్నారు. మెహిదీపట్నం నుంచి టోలిచౌకీ, టోలిచౌకీ నుంచి మెహిదీపట్నం వరకు వెళ్లే వాహనదారుల సమస్యలు మరింత జటిలంగా ఉన్నాయి. మోహదీపట్నం నుంచి టోలీచౌకీ, టోలీచౌకీ నుంచి లంగర్‌హౌస్ వెళ్లేవారు సాయంత్రం 4 గంటల తర్వాత రాత్రి 10 గంటల సమయంలో జంక్షన్ దాటాలంటే కనీసం పది నిమిషాలు పడుతుంది. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు నుంచి వచ్చేవారు, కూకట్‌పల్లిలోని బాలాజీనగర్‌కు వెళ్లాలంటే గతంలో ఆ కాలనీ ఎదురుగానే జంక్షన్ ఉండేది. మెట్రో కారిడార్ రావడం, ఇతర కారణాలతో జంక్షన్ మూసేసి సుమారు కిలోమీటరు దూరంలో యూటర్న్ ఏర్పాటు చేశారు. వాహనదారులు.. అంత దూరం వెళ్లి, సుమారు మరో కిలోమీటర్ తిరిగి రావాలి. చుట్టూ తిరగలేక చాలా మంది శివానంద రిహాబిలిటేషన్ హోం దగ్గర టర్న్ తీసుకొని ప్రమాదమని తెలిసినా రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్నారు. పంజాగుట్ట వద్ద రోడ్లు విశాలంగా ఉన్నప్పటికీ సిగ్నల్ పడినప్పుడు నిమ్స్ వరకు ట్రాఫిక్ జామ్ అవుతుంది. ప్యారడైజ్, పరేడ్ గ్రౌండ్ సిగ్నళ్లు ఒక్కోసారి రాణిగంజ్ వరకు ట్రాఫిక్‌ను ఆపుతుంటాయి.మాసాబ్‌ట్యాంక్ దాటగానే విరించి ఆస్పత్రి వద్ద అదే పరిస్థితి. ఖైరతాబాద్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ జామ్ అయితే ఎర్రమంజిల్ వరకు వాహనాలు నిలిచిపోతాయి. ఇలా నగరంలో 30కి పైగా సిగ్నళ్లు గంటల సమయాన్ని వృథా చేస్తున్నాయనడంలో అనుమానం లేదు. గాంధీభవన్, చాదర్‌ఘాట్, జూబ్లీహిల్స్, చెక్‌పోస్టు, హిమాయత్‌నగర్, విద్యానగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు చిక్కడపల్లి, హబ్సిగూడ, నాచారం, ఉప్పల్, సికింద్రాబాద్, నేరేడ్‌మెట్, ఎస్సార్‌నగర్, ఎర్రగడ్డ, శాలిబండ, చాంద్రాయణగుట్ట, సంతోష్‌నగర్, సైదాబాద్, బహదూర్‌పురా, సోమాజిగూడ, బేగంపేట్‌లాంటి ఎన్నో కూడళ్లలో సమస్యలు ఉన్నాయి. వీటి కారణంగా వాహనాల వేగం తగ్గిపోతోంది.

**త్వరలో తార్నాక చౌరస్తా పునఃప్రారంభం...**

యూ-టర్న్‌తో ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో ఐదేళ్ల క్రితం మూసివేసిన తార్నాక సిగ్నల్ తిరిగి ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఇటీవల ట్రాఫిక్ విభాగం పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు తార్నాక చౌరస్తాలోని సిగ్నల్ తిరిగి ప్రారంభించేందుకు సాధ్యాసాధ్యాలపై పరిశీలించారు. తార్నాక చౌరస్తాకు ఇరువైపులా ఉన్న రోడ్లను ఇటు ఆర్టీసీ ఆసుపత్రి, అటు సెయింట్ ఆన్స్ స్కూల్ వరకు తనిఖీ చేశారు. చౌరస్తాకు సమీపంలో ఇరువైపులా ఉన్న బస్టాప్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సిటీ జాయింట్ సీపీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ తార్నాక చౌరస్తాలో సిగ్నల్స్ మూసివేసి ఇరువైపులా యూ-టర్న్‌ను ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య తీరకపోగా,మరింత ఎక్కువ అయిందన్నారు. ప్రతిరోజు పీక్ టైమ్‌లో వాహనాలు గంటల తరబడి రోడ్డుపై నిలిచిపోయి తీవ్ర ట్రాఫిక్ జామ్కు కారణమవుతుందని అన్నారు. తార్నాకలో ఫ్లై ఓవర్ సదుపాయం ఉన్నప్పటికీ యూ-టర్న్‌ను వినియోగిస్తున్నారని, ఫ్లై ఓవర్ ఉన్న ప్రాంతాల్లో యూ-టర్న్ అవసరం లేదన్నారు. యూ-టర్న్ వల్ల వాహనదారులు ఒక కిలోమీటరు మేర అదనంగా ప్రయాణించాల్సి వస్తుందని, చాలా మంది వాహనదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ ప్రాంతాన్ని స్టడీ చేసిన తరువాతనే ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు.

## నేడు తాగునీటి సరఫరాలో అంతరాయం

హైదరాబాద్, నవంబరు 10 ప్రభాతవార్త : హైదరాబాద్ నగర వాసులకు బిగ్ అలర్ట్.. విషయం ఏంటంటే..మంజీరా పైపులైన్ లీకేజీకి మరమ్మతు నేపథ్యంలో రేపు నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని వాటర్‌బోర్డు ప్రకటించింది. మంజీరా పైపులైన్ లీకేజీకి మరమ్మతు నేపథ్యంలో రేపు నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపింది.నగరానికి సరఫరా చేసే మంజీరా ఫేజ్2లో కలబ్‌గూర్ నుంచి పటాన్‌చెరు వరకు 1500 ఎంఎం డయా పంపింగ్ మెయిన్‌కు భారీ లీకేజీలు ఏర్పడ్డాయి. సోమవారం ఉదయం 6 గంటల నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు మరమ్మతు పనులు చేపట్టనున్నారు.దీంతో ఆర్సీపురం, అశోక్‌నగర్, జ్యోతినగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, మియాపూర్, బీరంగూడ, అమీన్‌పూర్, ఎర్రగడ్డ, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట, కేపీహెచ్‌బీ కాలనీ, కూకట్‌పల్లి, మూసాపేట, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం తలెత్తనుందని అధికారులు తెలిపారు.

## బాలిక మెడలో తాళికట్టిన యువకుడు

పోక్సో కేసు కింద అరెస్టు

**హైదరాబాద్, నవంబరు 10 ప్రభాతవార్త :** డిగ్రీ బాలిక మెడలో తాళి కట్టిన యువకుడిని పోక్సో కేసు కింద అరెస్టు చేశారు పోలీసులు. పోలీసుల కథనం ప్రకారం..నల్గొండ జిల్లా మిర్యాలగూడ పరిధిలోని అల్లగడపకు చెందిన 26 ఏళ్ల యువకుడు హైదరాబాద్‌లో ఫోటోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఓ బాలిక కొన్ని నెలల కిందట కోఠి ఉమెన్స్ కాలేజీలో డిగ్రీ మెదటిసంవత్సరంలో చేరి హాస్టల్‌లో ఉంటోంది. ఆ యువకుడు తరచూ కోఠి ఉమెన్స్ కాలేజీ వద్దకు వచ్చి ఆ బాలికను కలిసేవాడు. ఈ క్రమంలో నవంబర్ 2న ఆ బాలికను తీసుకొని వెళ్లిపోయాడు. విద్యార్థిని హాస్టల్‌కు తిరిగిరాకపోవడంతో సిబ్బంది తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో వారు సుల్తాన్ బజార్ పోలీస్‌స్టేషన్‌లో కుమార్తె మిసయ్యిందని ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. సదరు యువకుడు ఆ బాలికతో కలిసి చాదర్‌ఘాట్ చౌరస్తాలోఉండగా.. పోలీసులకు చిక్కాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అతడిని ప్రశ్నించగా.. ఆ అమ్మాయి తాను ఒకర్నొకరం ఇష్టపడ్డామని, నవంబర్ 3న బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో ఇరువురం పెళ్లి చేసుకున్నామని చెప్పాడు. మైనర్ బాలికను పెళ్లి చేసుకొని, లైంగిక దాడికి పాల్పడటంతో యువకుడుపై పోక్సో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. బాలికను వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

**సైఫాబాద్, నవంబరు 10 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారించాలని పిడిఎస్‌యు డిమాండ్ చేసింది. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని పిడిఎస్‌యు నాయకులు హెచ్చరించారు. ఆదివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు, నాయకులు ఆనంద్, హరీష్, విశాల, కుమార్, హేమంత్ తదితరులు డిమాండ్లకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అన్ని రకాల పోస్టులను భర్తీ చేయాలని, అలాగే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో ఉన్న బోధన, భోదనేతర పోస్టులను కూడా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ సంక్షేమ హాస్టళ్ళ విద్యార్థులకు ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలను తక్షణమే అమలు చేయాలని, నాణ్యమైన భోజనం, నీరు అందించాలని , మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యార్థి నాయకులు

# జూబ్లీహిల్స్ రెస్టారెంట్‌లో పేలుళ్లు..

### పలు ఇళ్లు ధ్వంసం.. మహిళకు తీవ్ర గాయాలు.. యాజమాన్యంపై కేసు నమోదు



పేలుడుకు ధ్వంసమైన ఇల్లు

**పంజగుట్ట, నవంబరు 10 (ప్రభాతవార్త):** రెస్టారెంట్‌లో పేలుళ్ల శబ్దం రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురై ఇళ్లలోంచి బయటకు పరుగులు తీశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు సమీపంలోని తెలంగాణా స్పైసీ కిచెన్ రెస్టారెంట్‌లో శనివారం రాత్రి పెద్దఎత్తున శబ్దాలు వచ్చాయి. ఆ శబ్దాలు దాటికి రెస్టారెంట్ నుంచి పెద్దఎత్తున రాళ్లు విరిగి కిందపడ్డాయి. రెస్టారెంట్‌కు పక్కనే దుర్గాభవానీ నగర్ బస్తీ ఉంది. దీంతో ఆ రాళ్లు బస్తీలోని ఇళ్లపై పడడంతో నాలుగైదు ఇళ్లు ధ్వంసం కాగా పలు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. రాళ్లు పడడంతో ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. పేలుడు కారణంగా తాము నిరాశ్రయులయ్యామని పలువురు బస్తీవాసులు జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికంగా ఏ మేరకు నష్టం జరిగిందో అంచనా వేయడంతోపాటు రెస్టారెంట్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టారు. కంప్రెషర్‌లో గ్యాస్ లీకేజీ వల్లే పేలుడు జరిగినట్లు మొదట పోలీసులు నిర్ధారణకు వచ్చారు. తర్వాత గ్యాస్ సిలిండర్ పేలడం వల్లే పెద్దఎత్తున శబ్దాలు వచ్చాయని స్థానికులు అంటున్నారు. పేలుడు విషయంలో రెస్టారెంట్ యాజమాన్యం రకరకాల కారణాలు చెబుతుండడంతో పేలుడు మిస్టరీగా మారింది. దీంతో పోలీసులు క్లూస్‌టీంను రంగంలోకి దింపి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రమాదం మానవ తప్పిదమా లేక అనుకోకుండా జరిగిన ప్రమాదమా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




## మహారాష్ట్ర ఖర్గే మీటింగ్‌లో పాల్గొన్న కోట నీలిమ

**సంజీవరెడ్డినగర్, నవంబర్ 10, ప్రభాతవార్త :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అమరావతి పార్లమెంట్ సెగ్మెంట్ తియోసా అసెంబ్లీ నియోజకవర్గంలో మోజ్రీ గ్రామంలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో కోట నీలిమ పాల్గొన్నారు. మోజ్రీ గ్రామంలో మహా వికాస్ అగాడి కూటమి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పాల్గొని ప్రసంగించారు. సనత్‌నగర్ నియోజకవర్గ ఇంచార్జి కోట నీలిమ ఈసభ ఏర్పాట్లను పర్యవేక్షించి తియోసా అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన పరిస్థితులు కూలంకషంగా వివరించారు. ఈ సందర్భంగా ఖర్గే అమరావతి పార్లమెంట్ పరిధిలో చేయాల్సిన పనులు గురించి కొన్ని సూచనలుచేశారు. ఈ సందర్భంగా నీలిమ మీడియాతో మాట్లాడుతూ మహారాష్ట్ర ఎన్నికలలో ఇంచార్జిగా బాధ్యత వహించడం చాలా ఆనందంగా ఉందని, ఏఐసిసి తనమీద ఇంతటి బాధ్యత పెట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ మాదిగ చర్మకారుల సంఘం జెఏసి ఏర్పాటు

**నాంపల్లి, నవంబరు 10 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర మాదిగ చర్మకారుల సంఘం జేఏసి ఏర్పాటైనట్లు నాయకులు తెలిపారు. జేఏసి ఛైర్మన్‌గా మురథి దర్శనం, వైస్‌ఛైర్మన్‌గా సంగీత రాజలింగం, సిహెచ్.రాజమౌళి, జున్ను జకరయ్య, చీఫ్ అడ్వైజర్‌గా చింతలస్వామి మాదిగ, కన్వీనర్‌గా పూసపాటి శ్రీనివాస్, కోఆర్డినేటర్స్‌గా బొమ్మరి రామ్మూర్తి, పోకల కిరణ్ మాదిగ, బుగ్గ మైసయ్య, మహిళా కోఆర్డినేటర్స్‌గా పాలడుగు మేరీమాదిగ, ఇటుకల లలిత, నిర్మల, మాధవి, ట్రైనింగ్ కమిటీ డిఇన్యూనియేల్ డెవలప్‌మెంట్ కమిటీ మాతే స్వామి, ఆర్గనైజింగ్ కమిటీ ఇమ్మడి రాజు, సాంస్కృతిక విభాగం బరిగల రాములు, మచ్చ దేవేందర్, మీడియా కోఆర్డినేటర్స్ బరిగల శివ, సుంచు లింగన్న, యూనివర్సిటీ కోఆర్డినేటర్స్ కొత్తపల్లి తిరుపతి, నరసింహ, గద్దలరాజు, ఎం.నరేష్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అనంతరం జేఏసి కోఆర్డినేటర్ దేవుని సతీష్ మాదిగ మాట్లాడుతూ రాష్ట్రంలోనున్న తెలంగాణ లేబర్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

### నార్త్‌జోన్ ట్రాఫిక్ ఎసిపి శంకరరాజు

**బేగంపేట, నవంబరు 10, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ ముందుగా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరరాజు అన్నారు. ఆదివారం బేగంపేట శ్రీకట్టమైసమ్మ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శర్మాస్ వెల్‌నెస్‌సెంటర్ ఆధ్వర్యంలో కొలెస్ట్రాల్,అధిక బరువు,మజిల్, బాడీఫిట్ ఇలా పలు రకాలైన పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ శంకరరాజు పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో చిన్న వయసు కల్గిన వారే అధిక ఒత్తిడికి గురవుతూ అనారోగ్యం పాలవుతున్నారని, సరైన సమయంలో తిండి, నిద్రలేక వ్యాధులబారిన పడుతున్నారని, అలాకాకుండా ప్రతి ఒక్కరూ వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలని, వాకింగ్, జాగింగ్‌తోపాటు స్విమ్మింగ్, యోగా వంటి వాటితో ఉపశమనం పొందాలని సూచించారు.ఈ సందర్భంగా ఆలయ ఫౌండర్ ఛైర్మన్ చెక్కల సుభాష్ ముదిరాజ్, ఆలయానికి వచ్చిన భక్తులు, సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## బాగ్‌లింగంపల్లిలో రక్తదాన శిబిరం

**చిక్కడపల్లి, నవంబరు 10 ప్రభాతవార్త:** బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద జీజీ చారిటీ, నైన్‌స్టార్ హెల్త్‌కేర్ ఆసుపత్రిలో రోటరీ క్లబ్ జుబ్లీహిల్స్ సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పెద్దసంఖ్యలో ప్రజలు వచ్చి రక్తదానం చేసి తలసేమియా వ్యాధితో బాధ పడుతున్నవారిని ఆదుకోవాలని పైడిరాకేశ్‌రెడ్డి ఫౌండేషన్ డైరెక్టర్ సుచరితా రెడ్డి కోరారు. చిన్నారులకు రక్తమార్పిడికి నెలకు చాలా యూనిట్ల రక్తం అవసరమవుతుందని, ఎన్ని శిబిరాలు నిర్వహిస్తున్నా ఇంకా దాతలు కొరత ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛంద సంస్థలు, కళాశాలలు, విద్యార్థులు, ఉద్యోగులు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. తమ ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ జుబ్లీహిల్స్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నాగరాజు, అధ్యక్షుడు బాలకోటిరెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ

## ముందుకు రావాలి : ఎమ్మెల్యే ముఠా గోపాల్

**చిక్కడపల్లి, నవంబరు 10 ప్రభాతవార్త:** దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు ముందుకురావాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఆదివారం గాంధీనగర్ డివిజన్‌లోని ఎల్లయ్యబస్తీలో రాజు, ధరేనమందర్ ఆధ్వర్యంలో నిర్మింతచలపెట్టిన దేవాలయం పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు ముఠానరేశ్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యాశాఖాధికారుల వేధింపుల నుంచి

## కాపాడాలని వికాలాంగ టీచర్ మొర

**సైఫాబాద్, నవంబరు 10 ప్రభాతవార్త:** తాను విదేశాలకు వెళ్లకపోయినా విద్యాశాఖాధికారులు షోకాజ్ నోటీస్‌లు ఇచ్చి మానసిక వత్తిడీలకు గురిచేస్తున్నారని ఒక వికలాంగ ఉపాధ్యాయుడు ఉన్నతాధికారులకు మొర పెట్టుకున్నారు. ఆసిఫ్‌నగర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో సెకెండ్ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న బుర్రా శ్రీనివాస్ ఆదివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దసరా సెలవులు సందర్భంగా తాను హైదరాబాద్ నగరంలో ఉన్నప్పటికి తాను విదేశాలకు చెప్పకుండా వెళ్లానని, వివరణతో సమాధానం చెప్పాలని కోరుతూ డిఇఒ గత నెల 24వ తేదీన,మండల విద్యాశాఖాధికారి ఎండి ముస్తాఫా 28న షోకాజ్ నోటీస్ ఇచ్చారని ఆరోపించారు. తాను విదేశాలకు వెళ్లలేదని ఇద్దరూ అధికారులకు వివరణగా సమాధానం ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. అయినప్పటికి డిఇఒ, మండల విద్యాశాఖాధికారి తనపై కుట్రపన్ని ఈ నెల 9వ తేదీన తిరిగి షోకాజ్ నోటీస్ పంపించడం జరిగిందని, అయితే తాను నోటీస్‌ను తీసుకోలేదన్నారు. విద్యాశాఖాధికారులు తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ మానసికంగా వేదిస్తున్నారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ ఈ మేరకు ఆయన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంకు విజ్ఞప్తి చేశారు.

## ఆడపడుచు వివాహానికి డ్రెస్సింగ్ టేబుల్ అందజేత

**జగదేవ్‌పూర్, నవంబరు 10 (ప్రభాతవార్త):** జగదేవ్‌పూర్ మండలకేంద్రంలోని జై భీమ్ నగర్‌కు చెందిన తుర్కపల్లి కనకయ్య కూతురు వివాహం ఆదివారం జరుగగా విషయం తెలుసుకున్న జై భీమ్ యూత్ కమిటీ సభ్యులు డ్రెస్సింగ్ టేబుల్ అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ జై భీమ్ నగర్‌లో ప్రతి ఆడపడుచు వివాహానికి తమవంతు సహాయంగా డ్రెస్సింగ్ టేబుల్‌ను అందజేస్తున్నామని తెలిపారు. జై భీమ్ కమిటీ అధ్యక్షుడు మచ్చ హరీష్, గౌరవ అధ్యక్షుడు మచ్చ మహేష్‌కుమార్, సభ్యులు గడ్డం కనకయ్య, తుర్కపల్లి అరుణ్, కోశాధికారిదినేష

## పుస్తక పఠనంపై ఆసక్తి పెంచడమే గ్రంథాలయం లక్ష్యం

**చిక్కడపల్లి, నవంబరు 10 ప్రభాతవార్త:** పుస్తక ప్రేమీకులు వారంతా వొక బృందంగా 'బుక్ లవర్స్' గ్రూప్‌గా ఏర్పాటు చేసుకుని గ్రంథాలయాన్ని ప్రారంభించడం మంచి సంప్రదాయమని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఆనంద్‌బాగ్‌లో జైన్ బాలాజీ గేటెడ్ కమ్యూనిటీ ఆవరణలోని క్లబ్‌హౌజ్‌లో గ్రంథాలయాన్ని సొసైటీ అధ్యక్షుడు చలపతిరావు ప్రారంభించారు. ఈ గ్రంథాలయంలో మంచి పుస్తకాలు ఏది చదవాలి, కొత్తగా మార్కెట్‌లోకి ఏ గ్రంథాలు వచ్చాయి, షేర్ చేసుకునేందుకు ఉద్దేశించి గ్రంథాయాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. అందరికి అందుబాటులో ఉండే విధంగా గ్రంథాలయం ఏర్పాటు చేశామన్నారు. పుస్తకపఠనంపై ఆసక్తిని పెంచడమే లక్ష్యం అని అన్నారు. డాకర్టర్ సాగర్ సురభి, డాక్టర్ శరన్‌థామస్, పునీత్, రచయిత్రి అత్తలూరి విజయలక్ష్మి, సీత రావినూతల, సీతాప్రసాద్, ఉదయ్, సతీష్ తదితరులు పాల్గొనగా సీత రాయప్రోలు ప్రార్థనా గీతం ఆలపించారు.



గ్రంథాలయాన్ని ప్రారంభించిన దృశ్యం

# పాఠశాల ఎదుట చెత్త.. రోగాల బారిన విద్యార్థులు

### చెత్త తొలగించి పరిశుభ్రంగా ఉంచాలంటూ తల్లిదండ్రుల వేడుకోలు

**బేగంపేట నవంబరు 10, ప్రభాతవార్త**

బేగంపేట ప్రభుత్వ పాఠశాల పరిసరాలలో చెత్త పేరుకు పోవడంతో విద్యార్థులు అనారోగ్యాల బారిన పడుతున్నారంటూ తల్లి దండ్రులు ఆందోళన వ్యక్తం చేసారు. పాఠశాల ఎదుట పెద్ద కొండగుట్టలో చెత్త పేరుకుపోవడంతో ఈగలు, దోమల దాడి అధికంగా ఉంటుందని వారు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఆదివారం సంత జరుగుతుంది. మరుసటి రోజు (సోమవారం) అయితే ఈ ప్రాంతంలో ఎక్కడి కూర గాయల వ్యర్థాలు అక్కడే పడి ఉంటున్నాయమని ఆరోపిస్తున్నారు. స్థానికులు కొందరు పాఠశాల గోడను చెత్తకుండీలా మార్చివేసారు. సమీపంలోని నివాస గృహాల వారు పాఠశాల ప్రహరీ గోడ పక్కనే చెత్త వేస్తుండటంతో అక్కడ పెద్దకుప్ప తయారైంది. అసలే చలికాలం ఈగల మోత ఎక్కువగా ఉంటుంది. ఇదే సమయంలో దోమలు అధికంగా వస్తున్నాయని స్థానికులు ఆరోపించారు. ఇటీవల కాలంలో ప్రజలు రోడ్లపై ఎక్కడా చెత్తనువేయవద్దని, ఇంటింటికి వచ్చే ఆటోలకే చెత్త అందించాలంటూ జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో బేగంపేట బస్తీతో పాటు బేగంపేట సర్కిల్ పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించారు.అయినా ప్రజలు మాత్రం తాము మారేది లేదంటూ మరసటి రోజు నుంచే చెత్తను రోడ్లపై ఎక్కడ బడితే అక్కడ పడవేస్తున్నారు. ఇది ఒకరోజు తర్వాత తీవ్ర దుర్వాసన వస్తుండటంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీంతో పాటు పాఠశాల ముందు ఉన్న బోరు కూడా విరిగియుందని, స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని ఎవరూ పట్టించుకోవడంలేదని, దీంతో దోమల దాడి తీవ్రమైందని, దోమలతో చిన్నారులు జ్వరాల బారిన పడుతున్నారని వారు ఆరోపించారు. పాఠశాల ముందే పరిస్థితి ఇలా ఉంటే ఇక మిగిలిన ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగం అధికారులు స్పందించి బేగంపేట ఓల్డ్ కస్టమ్స్‌లోఉన్న ప్రభుత్వ పాఠశాల ముందు పేరుకుపోయిన చెత్తకుప్పను తొలగించాలని, పాఠశాల ముందు ఉన్న బోరింగ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



బేగంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందు పేరుకుపోయిన చెత్తకుప్ప

# కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్స్‌ను రద్దు చేయాలి

### టియుసిఐ రాష్ట్ర అధ్యక్షుడు దొంతి రాజేష్

**చిక్కడపల్లి, నవంబరు 10 ప్రభాతవార్త:**

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్స్‌ను రద్దుచేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టియూసిఐ) రాష్ట్ర అధ్యక్షుడు దొంతి రాజేష్ డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో చర్చ జరగకుండా, కార్మిక సంఘాల ప్రతినిధులతో చర్చలు జరపకుండా లేబర్‌కోడ్స్‌ను ఆమోదించడం సరైంది కాదన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టియుసిఐ మూడవ తెలంగాణ రాష్ట్ర మహాసభలు జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన దొంతి రాజేష్ మాట్లాడుతూ బడా కార్పొరేట్ కంపెనీల దోపిడీకి అనుకూలంగా చట్టాలను సవరణ చేయడం కార్మికుల విద్రోహ చర్య అని అన్నారు. ప్రజాస్వామిక దేశంలో కార్మికులు, కర్షకుల సంక్షేమం వారి అభివృద్ధికి కృషి చేయాల్సిన ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడడం అప్రజాస్వామికమని విమర్శించారు. బ్యాంకులకు రుణాలను ఎగ్గొట్టిన కార్పొరేట్లకు కోట్లాది రూపాయల రుణాలను రద్దు చేస్తారా అని ప్రశ్నించారు. దేశ ప్రజలకు అన్నం పెట్టే రైతుల నోట్లో మట్టికొడుతున్నారే తప్ప వారికి గిట్టుబాటు ధర కల్పించడం లేదని విమర్శించారు. కార్మిక, కర్షక కేంద్ర సంఘాలు ఈ నెల 26న తలపెట్టిన హెచ్చరిక అర్జీలను అధికారులకు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చార్లెస్ జార్జీ, ఎపి అధ్యక్షుడు మరీద్ ప్రసాద్, కర్ణాటక కార్యదర్శి బసవ లింగప్ప, ఏఐకెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుదమల్ల భాస్కర్, కార్యదర్శి మాన్యబుజేందర్, అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ రుద్రంగి సుధా, మహ్మద్ కాశీ, యాకయ్య, అనీల్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న దొంతి రాజేష్



మిస్‌టీన్ యూనివర్సిటీ ఏసీయా విన్నర్ శ్రేయాని సన్మానిస్తున్న దృశ్యం

## మిస్‌టీన్ యూనివర్శిటీ ఆసియా విన్నర్‌కు సన్మానం

**అల్వాల్, నవంబరు 10, ప్రభాతవార్త :** మిస్‌టీన్ యూనివర్శిటీ ఏసియాగా విజయం సాధించిన మల్కాజ్‌గిరి నియోజకవర్గం పరిధిలోని ఏఆర్‌కే హోమ్స్ నివాసి శ్రేయాను మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి, అల్వాల్ కార్పోరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డిలు ఘనంగా సత్కరించి, అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రేయా మరెన్నో విజయాలను సాధించాలని ఉన్నత స్థానాలను కైవసం చేసుకోవాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. శ్రేయా తల్లిదండ్రులైన ప్రియాపాండే, ఎస్‌కె పాండేలను అభినందించారు. ఈ వేడుకలో తాము భాగస్వాములైనందుకు ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మల్లిఖార్జునగౌడ్, పద్మిని, సుభాష్ అగర్వాల్, విపిన్ ఆచార్య, మహిపాల్‌రెడ్డి, అజిత్‌సాయి, అవినాష్, మోహన్‌పాఠక్, జయప్రకాష్‌ఓజా, తదితరులు పాల్గొన్నారు.

## కుల గణన సర్వేను పక్కాగా నిర్వహించాలి

**కొండపాక, నవంబరు 10, ప్రభాతవార్త:**

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టిన సామాజిక, అర్థిక, రాజకీయ, కుల గణన కార్య క్రమా న్ని సమర్థ వంతంగా నిర్వహించాలని కుకునూరుపల్లి తహసీల్దార్ మల్లి కార్జున రెడ్డి, ఎంఈఓ బి.సత్తయ్య ఎన్యూమరేటర్లకు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని లకు డారం, మెదినిపూర్ గ్రామాల్లో జరుగుతున్న కులగణన సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. వివరాలు నమోదు చేయడంలో సందేహాలుంటే పై అధికారులకు తెలి పాలన్నారు. ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లకు వివరాలు అందించాలన్నారు. ప్రజలు వివరాలు అందించడానికి ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ రవి, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కొండపాక మండల పరిధిలోని అరేపల్లిలో నిర్వహిస్తున్న సర్వేను తహసీల్దార్ దిలిప్ నాయక్ పరిశీలించారు.



అమరవాది లక్ష్మీనారాయణకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న రాంరెడ్డి

## ఘనంగా అమరవాది లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలు

**సైదాబాద్, నవంబరు 10 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్టీసి కాలనీలోని ఆయన నివాసానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి నాయకులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు భారీగా తరలివచ్చి శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు ఊరె లక్ష్మణ్, ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజర్ గణేష్ గుప్తా, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం మాజీ ఛైర్మన్‌లు నల్ల రఘుమారెడ్డి, చేగోని సుదర్శన్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గందె సురేష్ గుప్తా, మాజీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, అర్థం లక్ష్మయ్య, జిల్లా కోశాధికారి బిల్లకంటి కిరణ్ కుమార్ గుప్తా, రాష్ట్ర పొలిటికల్ ఛైర్మన్ చింతల రవికుమార్, చంపాపేట ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బచ్చు మహేష్ గుప్తా, కర్మన్‌ఘాట్ ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు రవిశెట్టి, హస్తినాపురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నీల మధుసూధన్ గుప్తా, నల్గొండ జిల్లా మాజీ అధ్యక్షుడు పొనగంటి మల్లయ్య, ఊరె మధుసూధన్ గుప్తా, విజయ్‌నాథ్, బండారు సుధాకర్ గుప్తా తదితరులు అమరవాది లక్ష్మీనారాయణకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## మండలంలో సర్వేను పరిశీలించిన అధికారులు

**న్యాల్‌కల్, నవంబరు 10, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ఆదివారం డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, మండల ప్రణాళిక అధికారి శ్రీనివాస్‌రెడ్డిలు పరిశీలించారు. మండల పరిధిలోని రత్నాపూర్, మల్గి,మరియంపూర్ గ్రామాల్లో ఎన్యూ మరే టర్లు నిర్వహిస్తున్న సర్వేను అదికారులు పరిశీలించారు. ప్రతి కుటుంబ సభ్యులు సర్వేకువచ్చే ఎన్యూమరేటర్లకు సహ కరించాలని మండల ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు అంజన, హనీఫా బేగం, రాజేశ్వరి, గయా బాయి, పంచాయితీ కార్యదర్శులు మల్లేశం పాల్గొన్నారు.

# బాలల అభ్యున్నతే దేశ పురోగతి

### తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా

**రవీంద్రభారతి, నవంబరు 10 ప్రభాతవార్త :**

నేటి బాలలే రేపటి భావి భారత నిర్మాతలని, బాలలు సుఖ సౌఖ్యాలతో అభ్యున్నతి చెందితేనే అన్నిరంగాల్లో దేశం పురోగతి సాధించగలుగుతుందని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, పర్యాటకశాఖల సౌజన్యంతో జైజవాన్ జైకిసాన్ జైకళాకార్ ఆర్గనైజేషన్, భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబిసి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఈనెల 14న జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్థ అధ్యక్షుడు లయన్ కె.వి.రమణారావు నిర్వహణలో కనులపండువగా జరిగిన బాలోత్సవ్‌కు ముఖ్యఅతిథిగా విచ్చేసిన దామోదర్‌గుప్తా విశిష్ట అతిథులు దైవజ్ఞశర్మ, చకిలం సుధాకర్, కె.దివ్యవాణి చౌదరి తదితరులతో కలిసి బుల్లితెర, వెండితెర బాలనటీమణులు కంద్రాతి రాగయోగిత, దీవెనలను భారత్ వరల్డ్ రికార్డ్స్ ప్రశంసాపత్రాలతో ఘనంగా సత్కరించి అభినందించి శుభాశీస్సులందజేసి ప్రసంగించారు. భారతదేశ తొలిప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు బాలలంటే అమితమైన ప్రేమాభిమానాలతో ఎన్ని ఒత్తిడిల్లోనున్నా బాలలతో మచ్చ టించేవారని, ఆయన జయంతి నవంబరు 14న ప్రతీయేడాది జాతీయ బాలల దినోత్సవాన్ని ఆన వాయితీగా జరుపుకొంటామని, నెహ్రూ చిన్నారు లను భావి నవభారత నిర్మాతలుగా అభివర్ణించారని గుర్తుచేశారు. లయన్ కె.వి.రమణారావు వందలాది మంది చిన్నారులతో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటుచేసి నేత్రపర్వంగా బాలోత్సవ్‌ను నిర్వహించడం హర్షదాయకమని అభినందించారు. చివరిగా అతిథుల చేతులమీదుగా బాలోత్సవ్‌లో ప్రదర్శినలిచ్చిన చిన్నారుల గురువులను ఘనంగా సత్కరించారు. దైవజ్ఞశర్మ శుభాభినందనలు, ఆశీస్సులందజేశారు.




యోగిత, దీవెనలను భారత్ వరల్డ్ రికార్డ్స్ ప్రశంసాపత్రాలతో సత్కరిస్తున్న దామోదర్‌గుప్తా



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.భాగ్యలక్ష్మి

### మహిళా బిల్లులో ఒబిసి మహిళలకు

## సబ్‌కోటా కల్పించాలి : భాగ్యలక్ష్మి

**సైఫాబాద్, నవంబరు 10 ప్రభాతవార్త:** ఓబిసిల అభ్యున్నతికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పెద్దపీత వేస్తున్నారని, ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మహిళా బిల్లుకు చట్టబద్ధత కల్పించారని ఓబిసి సెంట్రల్ కమిటీ జాతీయ అధ్యక్షురాలు ఎం.భాగ్యలక్ష్మి చెప్పారు. మహిళా బిల్లులో ఓబిసి మహిళలకు సబ్‌కోటా కల్పించాలని ఆమె ప్రధానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సెంట్రల్ కమిటీ 6వ కార్యవర్గ సమావేశంలో ఆమె ప్రసంగించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన అని చెప్పుకుంటున్నదేకాని ఆరు గ్యారంటీలను గాలికి వదిలివేసిందని, ఇందిరమ్మ ఇళ్ళ పేరిట తిరిగి నయవంచన చేస్తున్నదని ఆమె ఆరోపించారు. ఒక్క గజం భూమిలేని పేదలకు ఇళ్లు ఏలా ఇస్తారని ప్రశ్నించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిలో పేద కుటుంబానికి 100 గజాల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూంలు పేదలకు పంపిణీ చేయాలని, ఇందులో బిసిలకు 50 శాతం ఇళ్ళు కేటాయించాలని, నామినేటెడ్ పదవుల్లో బిసిలకు అవకాశం కల్పించాలని, వృద్ధులకు 4 వేల రూపాయల పెన్షన్ చెల్లించాలని, డిగ్రీ పాసైన నిరుద్యోగ యువతకు 10 వేలు నిరుద్యోగ భృతి చెల్లించాలని ఆమె కోరారు. జనవరి 3న సావిత్రిబాయి పూలే జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీత, సలహాదారు దానకర్ణచారి, బోనమ్ ఊర్మిళా, మాధవి, రచిత, రమ్య తదితరులు పాల్గొన్నారు.

## నివాస హక్కుల సాధనలో అశ్వాక్ విశేష కృషి

**సైఫాబాద్, నవంబరు 10 ప్రభాతవార్త:** మూసి పరివాహక బస్తీ ప్రాంత ప్రజల నివాస హక్కుల సాధనలో నివాస హక్కుల నేత అశ్వాక్ ఎంతో కృషి చేశారని మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు ఎస్.జీవన్‌కుమార్ చెప్పారు. అశ్వాక్ సార్ యాదిలో మానవ హక్కుల వేదిక హైదరాబాద్ జిల్లా యూనిట్ మహాసభ ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఈ సందర్భంగా జీవన్‌కుమార్ మాట్లాడుతూ పేద ప్రజల నివాస హక్కుల సాధనకోసం అశ్వాక్ ఎన్నో పోరాటాలను నిర్వహించారని ఆయన గుర్తుచేశారు. ఆయన పోరాటాలు, సేవలు మరువలేనివని కొనియాడారు. మూసినది అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు చేసే ప్రణాళికలలో ఉన్న లోపాలను, ప్రభుత్వ ఆలోచన విధానంలోఉన్న పరిమితుల గురించి ప్రొఫెసర్ పద్మజషా తెలిపారు.మానవహక్కుల ఉల్లంఘనగురించి హక్కుల కార్యకర్త మసూద్ చెప్పారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1979 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

**సైఫాబాద్, నవంబరు 10 ప్రభాతవార్త:** ఉమ్మడి రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ మాసాబ్‌ట్యాంక్‌కు చెందిన 1979 బ్యాచ్ డిప్లమా సివిల్ ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కళాశాల ప్రాంగణంలో జరిగింది. 40 మందికిపైగా పాల్గొన్న పూర్వ విద్యార్థులు తమ అనుబంధాన్ని వారు చదువుకున్న రోజుల్లోని తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఎంతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా వారికి ఎంతో నాణ్యమైన విద్యను అందించి ఉన్నత స్థానాలను అందుకోవడానికి తోడ్పడిన తల్లిలాంటి పాలిటెక్నిక్ కళాశాలకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్స్‌కు కో-ఆర్డినేటర్స్‌ను ఎన్నుకోవడం జరిగింది. ఎండి ఇక్రం, జి.చంద్రమౌళి, డి.ఉపేంద్రరెడ్డి, ఎన్.సత్యానంద్, ఎం.డి.అబ్దుల్లా ఎన్నికైనారు. కార్యక్రమంలో హాజరైన జిపిటిఅడ్వైజరీ బాడీ మెంబర్ ఆర్.సురేష్‌ఆనంద్, రమావత్‌లాలునాయక్‌లను కో-ఆర్డినేటర్లు జనరల్‌సెక్రటరీలుగా ఎన్నుకున్నారు. వారిని కో-ఆర్డినేటర్లు పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. కళాశాలలో నాటి జనరల్ సెక్రటరీగా, వైస్-ప్రెసిడెంట్‌గా పనిచేసిన అశోక్‌కుమార్, ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీ విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఆత్మీయ సమ్మేళనం విజయవంతంగా కొనసాగింది.

## టిడిపి బలం నిస్వార్థపరులైన కార్యకర్తలే

### -పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు



టిడిపి సభ్యత్వనమోదును ప్రారంభిస్తున్న బక్కని నర్సింహులు

**చిక్కడపల్లి, నవంబరు 10 ప్రభాతవార్త:** అనునిత్యం ప్రజలగుండెల్లో కొలువైన పార్టీ తెలుగుదేశం పార్టీ అని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వీధిలో మాజీ కార్పొరేటర్, టిడిపి నగర ప్రధానకార్యదర్శి పలుస బాలరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన పార్టీ సభ్యతనమోదు కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన బక్కని నర్సింహులు సభ్యత్వనమోదును ప్రారంభించి ప్రసంగించారు. తెలుగుదేశం పార్టీకి నిస్వార్థమైన కార్యకర్తలు, నిజమైన బలం ఉందన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పిన్నమనేని సాయిబాబా మాట్లాడుతూ పార్టీకి బలం కార్యకర్తలేనని అన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, నియోజకవర్గం నాయకులు బోసు, కట్టరాములు, ఎస్.ప్రకాశ్, రామ్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్, శివకృష్ణ, ఉదయ్‌గుప్త, శంకర్,భవానీ శ్రీనివాస్, ప్రదీప్‌గౌడ్, శక్తీప్రేమ్, సుక్రవేది, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలి

**మలక్‌పేట్, నవంబరు 11 ప్రభాతవార్త:** విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న నిర్వహించనున్న విద్యార్థి యుద్ధభేరి మహాసభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెల్ల మహేష్ కుమార్ పేర్కొన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థి యుద్ధభేరి మహాసభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్స్‌కు స్వంత భవనాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 22న అంబేద్కర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రం నుంచి అంబేద్కర్ భవన్ వరకు వందలాదిగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి మహాసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రసిడెంట్ దామర్ల సత్యనారాయణ, గ్రేటర్ అధ్యక్షులు మేడిరాజు, నాయకులు గోవింద్ రాజు, మచ్చనవీన్, ప్రకాష్, ఎల్లేష్, శివ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి యుద్ధభేరి మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం



కార్తీకమాస వన సమారాధన మహోత్సవంలో పాల్గొన్న శ్రీశైలంగౌడ్

## కార్తీకమాస వన సమారాధన మహోత్సవం

**పేట్‌బషీరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం, షాపూర్‌నగర్ డివిజన్ వీసస్ ఎన్‌క్లేవ్‌లోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, ఆలయంలో ఏర్పాటు చేసిన కార్తీకమాస వన సమారాధన మహోత్సవంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆశీస్సులు అందరికీ కలగాలని, అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో షాపూర్‌నగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వాసా శ్రీనివాస్ గుప్తా, సోమిశెట్టి పవన్‌కుమార్‌గుప్తా, బచ్చు వంశీగుప్తా వైస్ ప్రెసిడెంట్, శేఖర్‌గుప్తా వర్కింగ్ ప్రెసిడెంట్ జగదీష్‌గుప్తా జనరల్ సెక్రటరీ ఉప్పలయ్య ప్రెసిడెంట్ ఉప్పల నాగరాజు గుప్తా సెక్రటరీ ప్రసాద్ గుప్తా ట్రెజరర్ వీవీఎస్ మూర్తి చంద్రశేఖర్‌గుప్తా, వేణుగోపాలగుప్తా, ప్రభాకర్ గుప్తా, రాధాకృష్ణ, హర్షణగుప్తా, హర్షణ్‌గుప్తా, సంతోష్‌గుప్తా పాల్గొన్నారు.

## మూసి ప్రక్షాళన పేరిట మా ఇళ్లను కూల్చవద్దు

**ఎల్.బి.నగర్, నవంబరు 10 ప్రభాతవార్త:** మూసి ప్రక్షాళన పేరిట దశాబ్దాలుగా నివాసం ఉంటున్న మా ఇళ్లను కూల్చవద్దని బాధితులు డిమాండ్ చేశారు. మూసి పరివాహక ప్రాంతంలో రివర్‌బెడ్ సర్వే మళ్లీ చేయాలని, మూసికి రెండువైపులా రిటైనింగ్ వాల్స్ నిర్మించాలని మూసి హౌస్ ఓనర్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం చైతన్యపురి డివిజన్ మూసి పరివాహక ప్రాంతంలో ప్రదర్శన నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా పైసాపైసా కూడపెట్టుకుని స్థలం కొనుగోలు చేసి నిర్మించుకున్న నివాసాలను కూల్చివేసి మా జీవితాలను రోడ్ల పాలు చేయవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మా ఇళ్ల జోలికి రాకుండా మూసీ పునరుజ్జీవం చేసుకోవాలని మూసీ నిర్వాసితులు ప్రభుత్వాన్ని కోరారు. దశాబ్దాల క్రితం నుంచి నివాసం ఉంటున్న మమ్మల్ని ఖాళీ చేయించి ఇక్కడి నుంచి వెళ్లగొడితే తాము ఎక్కడికి వెళ్లి జీవనం సాగిస్తామని ఆవేదన వ్యక్తం చేశారు. పేద మధ్యతరగతి ప్రజల సమస్యను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం అండగా నిలవాలని వారు కోరారు.

### కాలనీలలో పరిశుభ్రమైన వాతావరణం ఏర్పాటు చేయాలి

**కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్**

**ఎల్.బి.నగర్, నవంబర్ 10 ప్రభాతవార్త:** కాలనీలలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా చూడాలని పరిశుభ్రమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ ఎస్బిహెచ్ కాలనీ, మోహన్‌నగర్ చౌరస్తాలో చెత్త పేరుకు పోతుందని సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు ఆదివారం కార్పొరేటర్ పవన్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆయా ప్రాంతాలలో పర్యటించారు. వెంటనే శానిటైజేషన్ సూపర్‌వైజర్, రాంకీ సూపర్‌వైజర్లను పిలిపించి కాలనీలో చెత్తను డంపింగ్ పాయింట్ల వద్ద ఎప్పటికప్పుడు తరలించి కాలనీ పరిశుభ్రంగా వుండేలా చూసుకోవాలన్నారు. రోడ్లు, వీధిదీపాలు, కుక్కలు, ట్రాఫిక్ వంటి సమస్యలు వున్నాయని కాలనీ వారు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా సమస్యలను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకొని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, బిఎన్ఆర్ రావు, శ్రీనివాస్, అరవింద్, నాయకులు వెంకట్ రెడ్డి, సత్యనారాయణ, మోనూ తదితరులు పాల్గొన్నారు.

## స్థలం కబ్జా కాకుండా ఆలయ అభివృద్ధికి అప్పగించాలి

**కుషాయిగూడ, నవంబర్ 10 ప్రభాతవార్త:** గ్రామంలో అన్యాక్రాంతం కానున్న కాప్రా 50 గజాల స్థలాన్ని కబ్జాదారులకు దక్కకుండా కాప్రా దేవాలయాల అభివృద్ధికి అప్పగించాలని కాప్రా గ్రామ అభివృద్ధి సమితి ఉప్పల్ ఎమ్మెల్యేను కోరింది. కాప్రాలోని హనుమాన్ ఆలయం ముందుగల 50 గజాల ఖాళీ స్థలం కబ్జా చేయడానికి కొందరు వ్యక్తులు ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు కొప్పుల కుమార్, నాయకులు ఉమామహేశ్వర్ గౌడ్, అశోక్ గౌడ్, రాజుగౌడ్, నవీన్‌కుమార్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు..

**నిజాంపేట్, నవంబరు 10, ప్రభాతవార్త :** 33/11కేవీ బాచుపల్లి సబ్ స్టేషన్ నుండి నేడు(సోమవారం) ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు 11కేవీ ఏసీ టైర్ల ఫీడర్ పరిధిలో బొల్లారం, ఇండస్ట్రీయల్ ఏరియా, కెన్నెడీ స్కూల్ రోడ్, ఎస్‌జెబి హిల్స్‌రోడ్, హరితవనం కాలనీ, కెసిఆర్‌సిఆర్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని బాచుపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

## సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి

**ఎమ్మార్పీఎస్**



బొల్లారంలో ఆత్మీయ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మార్పీఎస్ నేతలు

**కంటోన్మెంట్, నవంబరు 10 ప్రభాతవార్త:** సుప్రీంకోర్టు తీర్పు మేరకు తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని, సిఎం రేవంత్ రెడ్డిపై మాలలు ఒత్తిడి తేవడంతోనే రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ జాప్యం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేశ్ మాదిగ, కంటోన్మెంట్ కాంటెస్టెడ్ ఎమ్మెలే డాక్టర వంషా తిలక్‌లు తెలిపారు. కంటోన్మెంట్ ఎమ్మార్పీఎస్ ఇన్‌ఛార్జి ఇటుకశ్రీ కిషన్‌మాదిగ అధ్యక్షతన ఆదివారం బొల్లారంలో నిర్వహించిన మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి వారు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎస్సీ వర్గీకరణ జరగకపోవడంతో అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్లను కొన్ని ఉప కులాలు మాత్రమే ప్రయోజనం పొందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీలలోని 56 ఉప కులాలు లబ్ది పొందాలంటే ఎస్సీ వర్గీకరణ తెలంగాణలో తప్పని సరిగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షులు ఎస్.వై.అశోక్, బిజెపి రాష్ట్ర నాయకులు అరెపల్లి పరశరామ్, కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు రొట్టెల సునీల్ మాదిగ, దుబ్బ మరళీ, నవీన్ (చిన్నా), ఉమేష్, అర్జున్, ఈ.ఆర్. బాల్‌రాజ్, ఎసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏడడుగులు, వర్ణచిత్రం గ్రంథాల ఆవిష్కరణ

**రవీంద్రభారతి, నవంబరు 10 ప్రభాతవార్త :** ప్రముఖ రచయిత చిత్రపు హనుమంతరావు రచనల్లో నాలుగు దశాబ్దాల క్రితం తెలుగుజాతి జనజీవనం, మధ్యతరగతి మనుగడతత్వం తెలియజేస్తాయని ప్రముఖ రచయిత విహారి అన్నారు. ఆనాటి సాంఘిక చరిత్రను అక్షరబద్ధం చేసిన గ్రంథాలు వారివని, అన్ని రచనల్లో సాహిత్యావసరాన్ని, సామాజిక అవసరాన్నీ తీరుస్తున్నవని ఆయన కొనియాడారు. శ్రీమానస ఆర్ట్స్ థియేటర్స్, చిరునవ్వు సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో డా. ఓలేటి పార్వతీశం సభాధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన విహారి విశిష్ట అతిథులు రాయవరపు గణేశ్వరరావు, సి.ఎస్.రాంబాబు, డా. లలితవాణి, తుమ్మూరి రామమోహనరావు, ప్రేమమాన్వి, బండారుపల్లి రామచంద్రరావు, రఘుశ్రీ తదితరులతో కలిసి సుప్రసిద్ధ రచయిత చిత్రపు హనుమంతరావు రచించిన ఏడడుగులు, వర్ణచిత్రం గ్రంథాలను ఆవిష్కరించి ఏడడుగులు గ్రంథాన్ని వారి మాతృమూర్తికి, వర్ణచిత్రం గ్రంథాన్ని భార్య విజయలక్ష్మికి అంకితమిచ్చారు. అనంతరం అతిథుల చేతులమీదుగా గ్రంథకర్త దంపతులను ఘనంగా సత్కరించి జీవనసాఫల్య పురస్కారాన్ని ప్రదానంచేసి శుభాకాంక్షలు అందజేశారు. సభకుముందు డా. రాధాకుసుమ నిర్వహణలో పలువురు కవులు స్వీయ కవితాగానంతో సభికులను ఆకట్టుకుని సత్కారాలందుకున్నారు.

# నేటి నుంచి గురునానక్ జయంతి వేడుకలు

**కంటోన్మెంట్, నవంబరు 10 ప్రభాతవార్త:** సిక్కుల మతుగురువు శ్రీగురునానక్ దేవ్‌జీ 555 వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని నేటి (సోమవారం) నుంచి ఈ నెల 15వ తేదీ వరకు నగరంలోని సికింద్రాబాద్, అఫ్జల్‌గంజ్, నాంపల్లి, అశోక్‌నగర్ పరిసర ప్రాంతాల్లో భారీఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు శ్రీహైదరాబాద్ ప్రభందక్ కమిటీ అధ్యక్షులు బల్‌దేవ్ సింగ్‌బగ్గా, సత్ విందర్ సింగ్‌బగ్గా, ప్రధానకార్యదర్శి జగ్‌మోహన్ సింగ్‌లు తెలిపారు. ఆదివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని గురుద్వార్ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నేడు(సోమవారం) గురుద్వార్ మందిరం నుంచి నగర్ కీర్తన్‌తో ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. ఈ కీర్తన్ మహోత్సవ వేడుకలు సికింద్రాబాద్ గురుద్వార్ నుంచి మనోహర్ థియేటర్, క్లాక్‌టవర్, బాటా, ప్యాట్నీ సెంటర్, కింగ్స్‌వే, మోండా మార్కెట్ మీదుగా గురు ద్వార్‌కు చేరుకుంటుందన్నారు. అదేవిధంగా ఈనెల 13న అఫ్జల్ గంజ్‌లో సెకండ్ నగర్ కీర్తన్, 14,15న సికింద్రాబాద్ గురుద్వార్ సాహెబ్ వద్ద నైట్ కీర్తన్ ఉత్సవాలు భారీఎత్తున నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురు నానక్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు జోగేందర్ సింగ్ ముజిరల్, హర్పిత్ సింగ్ గులాటీ, ఇంద్రజిత్ సింగ్, జగన్ మోహన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిక్కు కమిటీ అధ్యక్షుడు బల్‌దేవ్ సింగ్‌బగ్గా



మాలల సమ్మేళనంలో మాట్లాడుతున్న నేతలు

## రిజర్వేషన్లు ఎత్తేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర

**మాల నేతలు**

**సరూర్‌నగర్, నవంబర్ 10 ప్రభాతవార్త:** కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణలో దళితుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్లను ఎత్తివేయడానికి కుట్రలు చేస్తున్నాయని తెలంగాణ స్టడీ సర్కిల్ ఛైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య, విశ్రాంత ఐఎఎస్ అధికారి పిఎస్ఎన్ మూర్తిలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ నగర శివార్లలోని జిల్లెలగూడలో ఆదివారం మహేశ్వరం నియోజకవర్గ మాలల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య వక్తలుగా హాజరైన వారు మాట్లాడుతూ మనువాదుల చేతిలో కీలుబొమ్మగా మారిన మంద కృష్ణ మాదిగ తమస్వార్థం కోసం దళితులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు ఉద్యమిం చాల్సిన అవసరం ఉందనీ ఈ నేపథ్యంలో 40 లక్షలకు పైగా ఉన్న మాలలు బిజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాలకు కనువిప్పు కలిగేవిధంగా గ్రామాల్లో, మండల కేంద్రాల్లో సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి ఎస్సీ వర్గీకరణను ఖండించా లని వారు పిలుపునిచ్చారు. మాలల కోసం జీవితాన్ని త్యాగం చేసిన స్వర్గీయ పివి రావు ఆశయ సాధన కోసం రాజీలేని పోరాటం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్, విశ్రాంతసైంటిస్టు జి.రాజేశ్వరరావు, రేకల గోపాల్, ఎంగల యాదగిరి, గజ్జెల రాంచందర్, గొట్టె యాదయ్య, ఆవుల జనార్ధన్, రాజు వస్తాద్, గోపోజు రమేష్, బత్తుల రాంప్రసాద్, గుడిమల్ల వినోద్, మన్నె శ్రీధర్, బలవంతరావు, మేకల సత్యనారాయణ, చందర్, రాజలింగం పాల్గొన్నారు.

## దత్తోపంత్ తెంగడి జయంతి వేడుకలు



జయంతి వేడుకల్లో పాల్గొన్న కేశవ్ సోని తదితరులు

**కెపిహెచ్‌బి కాలనీ, నవంబరు 10, ప్రభాతవార్త :** స్వదేశీ జాగరణ మంచ్ స్థాపకులు, దత్తోపంత్ తెంగడి జయంతి సందర్భంగా జెఎన్‌టియూ హైదరాబాద్‌లో వారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ప్రాంత ప్రచార ప్రముఖ్ ఇంచార్జీ కేశవ్‌సోని హాజరై, విద్యార్థులకు దత్తోపంత్ తెంగడి జీవితం, విలువలు, ధ్యేయాల గురించి వివరించారు. తన ప్రసంగంలో కేశవ్‌సోని దత్తోపంత్ తెంగడి భారతదేశాన్ని ఆర్థికపరంగా శక్తివంతం చేయాలనే లక్ష్యంతో 1991లో స్వదేశీ జాగరణ మంచ్‌ను స్థాపించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయన ఎబీవీపీ, భారతీయ మజ్దూర్ సంఘ్, భారతీయ కిసాన్ సంఘ్ వంటి ప్రాముఖ్యమైన సంస్థల్లో ప్రధాన పాత్రలు పోషించి, అనేక సామాజిక, ఆర్థిక సమస్యలకు పరిష్కారాలు చూపారు. గల్ఫ్ ప్రాంతాలకు వలసల సమస్యలు పరిష్కరించడంలో, నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటుకు ప్రోత్సాహం అందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. స్వదేశీ భావనకు భారత దేశంలో ప్రాచీనమైన మూలాలు ఉన్నాయని, స్వదేశీ ఉద్యమం మహాత్మ గాంధీ, అరవిందో వంటి మహనీయుల నాయకత్వంలో భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించిందని ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో స్వదేశీ జాగరణ్ మంచ్ జేఎన్టీయూ ఇంచార్జీ ఆదిత్య, రామ్ చరణ్, వికాస్ పాల్గొన్నారు.

### సమస్యల సాధనకై ఏఐటియూసి నిరంతరం పోరాటం

**సిద్దిపేట, నవంబరు 10, ప్రభాతవార్త ప్రతినిధి :** బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకు ఏఐటియూసి నిరంతరం పోరాడుతుందని ఏఐటియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం బీడీ కార్మిక సంఘం రెండో మహా సభలుజిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిరంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏఐటి యూసి అనేక పోరాటాలు నిర్వహించి కార్మికులకు హక్కులు సాధించిన ఘనత ఏఐటియూసికే దక్కుతుందన్నారు. వెట్టి చాకిరికి గురువుతున్న బీడీ కార్మికులకు కనీస వేతనం జీవో అమలు చేయాలని బీడీ కార్మికుల ఖాతాలో కూలీ డబ్బులు వేసే విధానం నిలిపివేసి పాత పద్దతి ప్రకారం కార్మికులకు నేరుగా నగదు పంపిణీ అమలుపర్చాలని అర్హులైన కార్మికులకు ఇండ్లు, ఇంటి స్థలం కోసం రూ.10 లక్షల ఆర్థిక సహాయం అదించాలని బీడీ పరిశ్రమపై పలుమార్లు పెంచుతున్న జీఎస్టీ పన్నునలను వెంటనే తగ్గించాలన్నారు. బీడీ కార్మికులకు నెలకు 26 రోజుల పని కల్పించడంతో సరిపడాతుని కాదు తంబాకుదారం తదితర ముడి సరుకుకంపెనీ సరఫరా చేయాలన్నారు. ఎన్ని కల సమయంలో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయా లన్నారు. సిద్దిపేటలోని పిఎఫ్ ఆఫీసును ఎట్టి పరిస్థితుల్లో తరలి ంచొద్దని తరలిస్తే ఆందోళనలు చేస్తామన్నారు. బీడీ కార్మికులకు కనీస పెన్షన్ రూ.5 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐటియూసి అనుబంధ బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు గోవర్ధన్, సుతారి రాములు, ఎం.డి.ముక్రం తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్టాపనోత్సవంలో పాల్గొన్న అందెల శ్రీరాములు యాదవ్

## హిందూ దేవాలయాలను పరిరక్షించుకోవాలి

**సరూర్‌నగర్, నవంబరు 10 ప్రభాతవార్త:** వరుస దాడుల సంఘటనల నేపథ్యంలో హిందూ ఆలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 27వ డివిజన్ కృష్ణ హోమ్స్ కాలనీలో ఆదివారం జరిగిన శ్రీరేణుకా ఎల్లమ్మ, పోచమ్మ విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పూజలు చేసిన అనంతరం మాట్లాడుతూ హిందూ దేవాలయాలపై వరుస దాడులు ఆందోళన కలిగించే విషయమని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి దేవాలయానికి ప్రభుత్వం సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట శ్రీధర్‌రెడ్డి, నిమ్మల సునీత శ్రీకాంత్‌గౌడ్, కాలనీ అధ్యక్షుడు నరేందర్, ఉపాధ్యక్షుడు వెంకటేష్, బిజెపి, యువమోర్చా నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## కుల గణనపై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

**బడంగ్‌పేల మేయర్ పారిజాత**



కుటుంబ వివరాలు తెలుసుకుంటున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, నవంబర్ 10 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి కోరారు. కార్పొరేషన్‌లోని బడంగ్‌పేట్‌లో ఆదివారం జరిగిన సర్వేను మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల గణనతో బిసి, ఎస్సీ, ఎస్టీ, ఉపకులాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేందుకు చేపట్టిన ఈ సర్వేకు ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. కమిషనర్ సరస్వతి మాట్లాడుతూ సర్వేను గడువులోగా పూర్తిచేయాలని ఎన్యూమరేటర్లకుల సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు లిక్కి మమతా కృష్ణారెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, ఆర్ఓ వేణుగోపాల్‌రెడ్డి, మేనేజర్ నాగేశ్వరరావు, సానిటరీ ఇన్స్‌పెక్టర్ వంకాయల యాదగిరి, నాయకులు గట్టు బాలకృష్ణ పాల్గొన్నారు.

# దళితబంధు అడిగితే దాడులా

**ఎమ్మెల్యే ముఠా గోపాల్**

**చిక్కడపల్లి, నవంబరు 10 ప్రభాతవార్త:** అర్హులైన దళిత కుటుంబానికి రూ. 10 లక్షలతో కూడిన దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ హుజురాబాద్‌లో ఆందోళన చేస్తున్న దళితులకు మద్దతుగా వెళ్లిన స్థానిక ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై పోలీసులు దాడి చేయడాన్ని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తీవ్రంగా ఖండించారు. ఒక ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా పోలీసులు దాడి చేశారని, పిడిదుద్దులు గుద్దారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల దాడితో స్పృహ కోల్పోయిన కౌశిక్‌రెడ్డిని పార్టీ నాయకులు, కార్యకర్తలు హుటాహుటిన ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారని, ప్రస్తుతం కోలుకుంటున్నారని అన్నారు. కౌశిక్‌రెడ్డిపై దాడి చేసిన పోలీసులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తోందని, ప్రశ్నించే గొంతులను నొక్కడానికి యత్నిస్తున్నారని విమర్శించారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయకుండా డైవర్ట్ పాలిటిక్స్‌కు పూనుకుంటున్నారని విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో దళితులకు దళితబంధు అందించి వారి ఆర్థికపురోభివృద్ధికి ఆదుకున్నారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి పూనుకోవద్దని హితవు పలికారు.

## న్యాల్‌కల్‌లో సమగ్ర కుటుంబ సర్వే

**న్యాల్‌కల్, నవంబరు 10, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామంలోని ఇండ్ల కాడికి చేరుకుని కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తున్నారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్‌పాఠశాల ప్రధానోపాధ్యాయులు సచ్చిదానందరెడ్డి, ఉపాధ్యాయులు శ్వేత, అంగన్‌వాడి టీచర్ మాలెపద్మ, జగదీశ్వరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ఈటల

## దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ప్రధాని మోదీ : ఎంపి ఈటల రాజేందర్

**కంటోన్మెంట్, నవంబరు 10 ప్రభాతవార్త:** దేశాన్ని ప్రగతి పథంలో నడిపించేది ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమౌతుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం కంటోన్మెంట్ 6వ వార్డు భావన కాలనీలో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామక్రిష్ణ, మాజీ ఉపాధ్యక్షురాలు బానుక నర్మధ, కంటెస్టెడ్ ఎమ్మెల్యే వంషాతిలక్, బిజెపి నాయకులు బి.ఎన్.శ్రీనివాస్, బానుక మల్లికార్జున్, బాణాల శ్రీనివాస్ రెడ్డి, విజయ రామరాజు, అజయ్‌గౌడ్, సాయిప్రకాశ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

**పేదలకు వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి...**

**అడ్డగుట్ట, నవంబరు 10 ప్రభాతవార్త:** పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛందసంస్థలు ముందుకు రావాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బిజెపి మహంకాళి జిల్లా కార్యదర్శి, మహేంద్ర హిల్స్ శాంతినికేతన్ కాలనీ అధ్యక్షుడు మద్దెర్ల శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో ఆదివారం ఈస్ట్ మారేడ్‌పల్లిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు వైద్య నిపుణులు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, బిజెపి రాష్ట్ర నాయకులు వెంకట్ రమణి, నాగేశ్వర్ రెడ్డి, ప్రభుగుప్త, కనకట్లహరి, అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన బిజెపి నాయకులు గెల్లు ఉదయ్ యాదవ్, రాజేశ్, వేణుగోపాల్, సాయిబాబా, శివాజీ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

### సొంత నిధులతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తా : ఎమ్మెల్యే

**కంటోన్మెంట్, నవంబరు 10 ప్రభాతవార్త:** మట్‌పోర్ట్ సెంట్ ఆంథోని చర్చి ఫాదర్ జోసఫ్ డాక్టర్ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్య శిబిరాలు, కంటి అపరేషన్లు తన సొంత నిధులతో నిరంతరం చేపడుతున్నామన్నారు. అదే తరహాలో స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు జేస్‌దాస్, లెస్లీ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : రామక్రిష్ణ

**కంటోన్మెంట్, నవంబరు 10 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని సమస్యలను దశలావారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని బోర్డు మెంబర్ జె.రామక్రిష్ణ తెలిపారు. ఆదివారం 5వ వార్డు దుర్గయ్య గార్డెన్‌లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్.కె. మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతోనే కంటోన్మెంట్‌లో అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు విజయ్‌యాదవ్, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కార్తీక వన సమారాధన

**సరూర్‌నగర్, నవంబర్ 10 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలం శ్రీశైలం రహదారిలోని ఎర్రకుంటలోనున్న చారిత్రక ఉపాసన మందిరంలో ఆదివారం కార్తీక వన సమారాధన మహోత్సవం ఘనంగా జరిగింది. వనస్థలిపురానికి చెందిన దత్తభక్తుడు వెంకట శేషాచలపతి, మణిమాల దంపతుల ఆధ్వర్యంలో మందిరం పూజారి సుధీర్ కపూర్ కార్యక్రమానికి హాజరైన భక్తులచే అభిషేకాలు, బిల్వ పత్ర సమర్పణ పూజలు నిర్వహించారు. మహా హారతి అనంతరం వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు.

### వెంకటేశ్వరుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే, కౌన్సిలర్లు

**నార్సింగి, నవంబరు 10 ప్రభాతవార్త:** మణికొండ మున్సిపల్ కౌన్సిలర్లుగా 5.సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంను పురస్కరించుకొని ఆదివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో కలిసి కౌన్సిలర్లు కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల వెంకటేశ్వరుడిని దర్శించుకున్నారు. ఉదయం ప్రత్యే దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ మనం ఎంత కష్టపడినా దేవుడి ఆశీర్వాదం ఉంటేనే చేపట్టిన కార్యంలో విజయం సాధిస్తామన్నారు. తన కొండకు వచ్చి కొలిచిన వారికి, కోరికలు తీర్చడంలో వేంకటేశ్వర స్వామిని మించిన దేవుడు లేడన్నారు. భక్తులందరి కోరికలు తీరుస్తుండడం వలన ఏటా కోట్లాది మంది భక్తజనం స్వామి వారిని దర్శించుకొని వందల కోట్ల రూపాయలను కానుకగా సమర్పించుకుంటున్నారని తెలిపారు. ప్రజలకు సేవ చేయాలంటే రాజకీయం ఒక్కటే సరైన మార్గమని, సేవ చేయాలనుకున్న వారు మాత్రమే రాజకీయంలోకి రావాలని సూచించారు. పదవులు పొందిన తరువాత నిత్యం ప్రజల మధ్యన ఉంటేనే ప్రజలు ఎన్నికల్లో ఓట్లు వేసి తమ ప్రజా ప్రతినిధిగా ఎన్నుకుంటారని ప్రకాశ్‌గౌడ్ వివరించారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి ఇబ్బందులు దూరం చేస్తుండడం వల్లనే వరుసగా నాలుగోసారి రాజేంద్రనగర్ ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించారని స్పష్టం చేశారు. తిరుమలేశుడిని దర్శించుకున్న వారిలో కొండకళ్ల రామకృష్ణారెడ్డి, వందన నాగేష్, కావ్యశ్రీరాములు తదితరులు ఉన్నారు.



వేంకటేశ్వరుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కౌన్సిలర్లు

# దేశంలోనే అరుదైన ఘనత సాధించిన ప్రభుత్వ సిటీ కళాశాల

**విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ఆచార్య జి.యాదగిరి**

**చార్మినార్, నవంబరు 10 ప్రభాతవార్త :** శత వసంతాల ప్రభుత్వ సిటీ కళాశాల నాక్ అక్రెడిటేషన్‌లో దేశంలోనే అత్యున్నతమైన గ్రేడ్‌ను పొంది అరుదైన ఘనత సాధించిందని విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ఆచార్య జి.యాదగిరి అన్నారు. బెంగుళూరులో నాక్ విడుదల చేసిన ఫలితాలు ప్రకారం హైదరాబాద్ పాతబస్తీలో ఉన్న ప్రభుత్వ సిటీ కళాశాల 3.67 సిజిపిఎ సాధించి అరుదైన చరిత్ర సృష్టించిందని ఆయన కొనియాడారు. ప్రభుత్వ సిటి కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన సంబురాల కార్యక్రమంలో విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ఆచార్య జి.యాదగిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సిటీ కళాశాల నాక్ అక్రెడిటేషన్‌లో దేశంలోనే అత్యున్నతమైన గ్రేడ్‌ను పొంది అరుదైన ఘనత సాధించటం గొప్ప విషయమని తెలియజేశారు. సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాలభాస్కర్ మార్గ దర్శనంలో ఐక్యూఏసి సమన్వకర్త డాక్టర్.నీరజ్ కృషి, అధ్యాపక బృందం సమిష్టి ప్రయత్నం, బోధనేతర సిబ్బంది సహకారం, విద్యార్థుల క్రియాశీలకమైన భాగస్వామ్యంవల్ల సిటీ కళాశాల జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని సంయుక్త సంచాలకులు రాజేంద్ర సింగ్ తెలిపారు. విద్యా సంస్కరణలో సిటీ కళాశాల మార్గ దర్శకమైన ప్రమాణాలు పాటించిందని విద్యాశాఖ అధికారులు ప్రశంసించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాలభాస్కర్ మాట్లాడుతూ గత నాక్ బృందం ఇచ్చిన సూచనలన్నింటినీ సంపూర్ణంగా అమలు చేయటంతో పాటు కళాశాలకు స్వంత నిధులతో కొత్త భవనాన్ని సమ కూర్చుకున్నామని తెలిపారు. కళాశాల అధ్యాపక బృందం అంతరాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన జర్నళ్లల్లో 400 పైగా పరిశోధన పత్రాలు ప్రచురించటం వల్ల ప్రభుత్వ సిటీ కళాశాల ఘన కీర్తి ప్రపంచానికి తెలిసిందని ఆయన తెలియజేశారు. కళాశాల విద్యాశాఖ కమీషనర్ దేవసేన ఈ అపూర్వ ఘనత సాధించిన సిటీ కళాశాల ప్రిన్సిపాల్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విప్లవ్‌దత్ శుక్లా, భవనం ఇంఛార్జి డాక్టర్ యాదయ్య, మాధవితో పాటు కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## శాంతి మత సామరస్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**డిసిపి స్నేహ మెహ్రా**

**చార్మినార్, నవంబరు 10 ప్రభాతవార్త :** శాంతి మత సామరస్యం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దక్షిణ మండలం డిసిపి స్నేహ మెహ్రా అన్నారు. పాతబస్తీ షంషేర్‌గంజ్‌లోని క్రిస్టల్ గార్డెన్‌లో జరిగిన పీస్ కమిటి సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతి మత సామరస్యం కోసం ప్రతీ ఒక్కరూ పాటు పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మండలం అడిషనల్ డిసిపి షేక్ జహంగీర్, పీస్ కమిటి ప్రెశిడెంట్ కె.ఎం.మొయిజ్, ఉపాధ్యక్షులు టిప్పు సోనీ, వర్కింగ్ ప్రెశిడెంట్ సీతారామ రాజు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జైన్‌లు పాల్గొన్నారు.


**IN THE COURT OF THE HON'BLE PRL JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DIST AT : L.B. NAGAR**
**O.S.No. 731 of 2024**

Between:
**Smt M. Mounika & others** ...Petitioners
AND
**1. The Tahsildar,** Balapur Ranga Reddy Dist.
**2. All Concerned** ...Respondents

**NOTICE**

Please take notice that the above suit is filed by the plaintiffs for Suit for declaration declaring the plaintiffs as the legal heirs of the deceased **Late M. Mahendar Goud S/o M. Raja Lingam Goud.** before the above Hon'ble court against the Respondent No.2 All Concerned. If any person or persons have any interest or objection they may appear before the above Hon'ble court and the above suit is posted on Dated **25/11/2024 at 10:30 A.M** For your Appearance. If fail to appear on the above said date and time the matter will be decided as per law.

(BY ORDER OF THE COURT)

**Sd/- M/s M. YADAIAH GOUD**
**M. RAMA KRISHNA GOUD**
**Advocates**
Office at Flat No.201, JD Residency, Shamshabad Village & Municipal, R.R. Dist, T S. Pin 501218
**Cell: 9963632535**

## జాతీయ క్రీడల్లో రెండు పతకాలు సాధించిన అశ్వథామ



**దూల్మిట్ట, నవంబర్ 10, ప్రభాతవార్త** దూల్మిట్ట మండల కేంద్రానికి చెందిన మాజీ జడ్పీటీసి నాచగోని పద్మ వెంకట్‌గౌడ్‌ల కుమారుడు నాచగోని అశ్వథామ తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ హాకింపేటలో పదవ తరగతి చదువుతూ జాతీయ స్థాయిలో జరిగిన రోయింగ్ క్రీడల్లో పాల్గొని కొస్యం, రజత పతకం వరుసగా రెండు సాధించాడు. దీంతో తల్లిదండ్రులతో పాటు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బాల్య మిత్రుల ఔదార్యం



నూతన వధూవరులతో బాల్య మిత్రుల బృందం

**ఆమనగల్లు, నవంబర్ 10, ప్రభాతవార్త:** 40 ఏళ్ల నాటి బాల్య మిత్రులు ఆదివారం ఒకే వేదికపై కలుసుకుని సందడి చేశారు. వివిధ ప్రాంతాలలో స్థిరపడిపోయిన 30 మంది బాల్య మిత్రులు నాటి బాల్యమిత్రుడు కసిరెడ్డి నరసింహారెడ్డి కుమారుని వివాహంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు ఆప్యాయంగా, ప్రేమతో పలకరించుకొని సంబరపడిపోయారు. గత స్మృతు లు, జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం బాల్యమిత్రుని కుమారుని వివాహానికి రూ. 25 వేలు అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. నాలుగు దశాబ్దాల తర్వాత కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని వారంతా ఆనందం వ్యక్తం చేశారు.

## అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు నమోదు చేసుకోవాలి

### పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి

**కోట్‌పల్లి ,నవంబరు 10 ప్రభాతవార్త;** 18, సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరు తప్పకుండా ఓటరు నమోదు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాడు కోట్‌పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామంలో ఓటరు లీస్టులో మార్పులు చేర్పులు తదితర అంశాలపై పంచాయతీ కార్యాలయంలో ముందు ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ. 18,సంవత్సరాలు నిండిన వారందరూ జనవరి 01,2025, నాటికి 18,సంవత్సరాలు నిండబోయే వారు ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి అర్హులన్నారు. 18, సంవత్సరాలు నిండిన వారు వారు ఓటరుగా నమోదు చేసుకోవడానికి మరో అవకాశం అని ఓటరు జాబితాలో మరో తమ పేరు ఉందో ఓటరు చెక్ చేసుకొని ఓటరుగా పేరు లేకుంటే ఫారం 6, ద్వారా పోలింగ్ బూత్‌లో వద్ద నమోదు చేసుకోవాలన్నారు.18,సంవత్సరాలు నిండిన వారు రెండు కలర్‌పాసు పోటోసైజ్‌లు నివాస వయస్సు,ధృవీకరణ పత్రం తీసుకరావలన్నారు. ఆన్‌లైన్ ద్వారా కుడా దరఖాస్తు చేసుకోవచ్చని వారు పేర్కొన్నారు, ఈకార్యక్రమంలో కారోబార్ అశోక్, అంగాన్‌వాడీ కార్యకర్త అనిత, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో పాలన గాడి తప్పుతుంది

### -ప్రజల సమస్యలనఉు గాలికి వదిలిన నాయకులు

### -చేవెళ్ల మండల బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు నత్తి క్రిష్ణారెడ్డి

**చేవెళ్ళ, నవంబర్ 10, ప్రభాతవార్త** తెలంగాణలో పాలన గాడి తప్పిందని, ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన నాయకులు పట్టించుకోవడంలేదని చేవెళ్ల మండల బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు నత్తి క్రిష్ణారెడ్డి విమర్శించారు. ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చేవెళ్ల మండల బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు నత్తి క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ఆరుగ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రేస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అధికారంలోకి వచ్చిన వేంటనే రుణమాఫీ చేస్తామని చెప్పిన నేతలు అధికారంలోకి 11 నెలలు గడుస్తున్న రుణ మాఫీ చేయలేదన్నారు. రుణమాఫీ చేస్తామని ఊకదుంపుడు హామిలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వంకు గుణపాఠం తప్పదన్నారు. రైతుబంధు లేదని, వరికి బోనస్ ఇవ్వలేదన్నారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి ఇప్పటి వరకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారో చేప్పాలన్నారు.విద్యార్దులకు స్కాలర్‌షిప్‌లను అందించలేని చేత ప్రభుత్వంను నిలదీయాలన్నారు.కాంగ్రేస్ ప్రభుత్వంపై ప్రజలు తిరుగబడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

## జోగు పృథ్వీరాజ్ కు సన్మానం



**ఇబ్రహీంపట్నం, నవంబర్ 10, ప్రభాతవార్త :** మంచాల మండలం బండలమూర్ గ్రామానికి చెందిన జోగు పృథ్వీరాజ్ ఇటీవల విడుదలైన ప్రభుత్వ ఉద్యోగ ఫలితాల్లో నాలుగు ఉద్యోగాలకు అర్హత సాధించారు. ఆదివారం బిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నౌసు యాదగిరితో పాటు గ్రామస్తులు పృధ్వీరాజ్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నౌసు యాదగిరి మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన జోగు పృధ్వీరాజ్ పేద కుటుంబంలో జన్మించి తల్లిదండ్రులని కోల్పోయిన కూడా నిరుత్సాహపడకుండా కష్టపడి చిన్న తనం నుండి ఎన్నో కష్టాలను చూసి ఈమధ్య విడుదలైన వివిధ ఉద్యోగాలకు అర్హత సాధించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కొంకాని విజయ్ కుమార్, రామలింగం, గణేష్, చిరంజీవి, ప్రభాకర్, లింగస్వామి, అరుణ్, శేఖర్ తదితరులున్నారు.

## కొనసాగుతున్న కుటుంబ సర్వే పలు సూచనలు చేసిన ఎంపీడీవో శ్రీకాంత్

**తలకొండపల్లి, నవంబర్ 10, ప్రభాతవార్త :** తలకొండపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం నాడు కుటుంబ సర్వే ప్రారంభించారు. మండలంలోని ఆయా గ్రామాల ఎనిమినేటర్లు స్టిక్కర్ వేసిన ఇండ్ల వద్దకు వెళ్లి ఇంటి యజమానులు వారి కుటుంబ సభ్యులతో పూర్తిస్థాయి సమాచారం సేకరించి ప్రభుత్వం అంది అందజేసిన పత్రాలలో నింపి వేస్తున్నారు. మండలంలోని మెదక్ పల్లి, జంగారెడ్డి పల్లి, రాంపూర్ , నిర్వహిస్తున్న ఎనిమినేటర్ సర్వేలో తాసిల్దార్ నాగార్జున, మండల ఎంపీడీవో రఘు మండలం పంచాయతీ అధికారి రఘు లు పాల్గొని ఎనిమరేటర్లకు పలు సూచనలు కోడ్ నెంబర్లు తెలియజేశారు. మెదక్ పల్లి గ్రామంలో కుటుంబ సర్వే నిర్వహిస్తున్న గ్రామ కార్యదర్శి రమేష్ కు సూచనలు చేశారు. మండలంలోని గ్రామాల్లో ఎంపీడీవో శ్రీకాంత్లు సందర్శించారు. .ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సర్వేను పూర్తిస్థాయిలో సమాచారం సేకరించి సర్వే పత్రాలను పూర్తి చేయాలని ఇలాంటి తప్పులు దొరకకుండా పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని ఈ సందర్భంగా వారు పలు సూచనలు .,సలహాలు చేశారు కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో ఎనిమిటేటర్లు గ్రామ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.



# ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

### సత్వర న్యాయం, సమన్యాయం అందించేలా కృషిచేయాలి

### రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి నగేష్ భీమపాక



**తాండూరు టౌన్, పెద్దేముల్, నవంబరు 10, ప్రభాతవార్త:** ప్రజల నుంచి వచ్చే కేసులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి గౌరవ నగేష్ భీమపాక అన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలో అడిషనల్ కోర్టు భవనము, బార్ అసోసియేషన్ రూమ్‌ను ప్రారంభించారు. బార్ అసోసియేషన్ అధ్వర్యంలో వినాయక కన్వెన్షన్ పంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశానికి హజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. క్రిష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులచే స్వాగత నృత్యప్రదర్శన గావించారు. ఈ సంద ర్భంగా న్యాయమూర్తి నగేష్ భీమపాక మాట్లాడుతూ ప్రజలకు సత్వర న్యాయం, సమన్యాయం అందించాలని, న్యాయవాదులు ఓపిక, సహనంతో ఉండి వృత్తికి గౌరవం తీసుకురావాలని అన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ కమిటి సభ్యులు జడ్జిని అపాయింట్‌మెంట్ చేయాలని, భావి తరాలకు విశాలంగా ఉండెందుకు మరికొంత భూమి ఇప్పించవలసిందిగా కోరగా, ప్రయత్నం చేస్తానని అన్నారు. తన అనుభవంలో జరిగిన ఒక సంఘ టనను గుర్తు చేస్తు ఒక కేసు పరిష్కార విషయంలో చాల సార్లు వాయిదాలు వేయడం వల్ల వారు వృద్యాప్యంలోకి వచ్చారని, అలా కాకుండా వచ్చి నటువంటి కేసులను వాయిదాలు వేయకుండ సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా నృత్యప్రదర్శన చేసిన విద్యార్థులను అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా జడ్జి సున్నం శ్రీనివాస్‌రెడ్డి, అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి చంద్రకిషోర్, సెక్రటరి లీగల్ సర్విస్ అథారిటి సీతల్, తాండూరు జూనియర్ సివిల్ జడ్జ్ శివలీల, తెలంగాణ బార్ అసోసియేషన్ వైస్ చైర్మెన్ సునిల్‌గౌడ్, సభ్యులు అనంత్‌సెన్‌రెడ్డి, తాండూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.శ్రీనివాస్, ఉపాధ్యాక్షులు గుండప్ప, ప్రధానకార్యదర్శి పి,చంద్రశేఖర్‌రెడ్డి, ట్రెసరర్ రవికుమార్, సంయుక్త కార్యదర్శి యండి ఫరిద్, సోఫియా, సభ్యులు కమలాకర్, కలామ్, యంఏ జిలాని, ఆంజనేయులు, సీనియర్ న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, విజయ కుమార్, బస్వరాజ్, చంద్రశేఖర్, మహేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలి

### -అమీన్‌పూర్ తహశీల్దార్ రాధా

**అమీన్‌పూర్, నవంబర్ 10 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు దోహదపడుతుందని అమీన్‌పూర్ తాహశీల్దార్ రాధా తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వేలో అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం జానకంపేటలో నిర్వహించిన ఇంటింటి సర్వేను తహశీల్దార్ రాధా పరిశీలించారు. అనంతరం ఇంటింటికీ సమగ్ర సర్వే స్టిక్కర్‌లను అంటించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ సమగ్ర ఇంటింటి సర్వేకు మున్సిపల్ ప్రజలందరూ సహకరించాలని తెలిపారు. ఇంటింటి సర్వేలో అన్ని కుటుంబాలకు సంబంధించిన అన్ని వివరాలు సేకరించి తప్పులు లేకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రఘునాథ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



సమగ్ర ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న తహశీల్దార్ రాధా

## అనుమాస్పద స్థితిలో రైతు మృతి

**నవాబుపేట నవంబర్ 10 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎల్లకొండ గ్రామానికి చెందిన చిన్నమలుపు అమరేందర్ (35) రైతు అనుమానస్పదస్థితిలో బావిలో పడి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. మృతుని భార్య, ఎస్ఐ అరుణ్‌కుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అమరేందర్ ఆయన భార్య అనిత ఉదయం పొలం పనులకు ఒకరి అనంతరం ఒకరు వేరు వేరుగా పొలానికి వెళ్ళారు. అమరేందర్ గ్రామానికి చెందిన కొత్లపూరం మహేందర్‌తో ఎద్దులను తోలుకుని పొలానికి చేరుకున్నాడు. కొద్ది సమయం అనంతరం పత్తి సంచి తీసుకుని, భార్యను కూడా బైక్‌పై ఎక్కించుకుని మహేందర్ ఇంటి వద్ద దింపేసి ఆయన తిరిగి వెళ్ళాడు. కొద్ది సమయాకీ భార్య అనిత భర్తకు ఫోన్ చేయడంతో ఏలాంటి స్పందన రాకపోవడంతో ఆచూకి కోసం ఆమె పొలం వద్దకు బయలు దేరుతున్న సమయంలో ఆమె బావ రాజేందర్ ఎదురై బావి వద్ద చెప్పులు, సెల్‌ఫోన్ ఉన్నాయని తెలుపడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అంధించడంతో ఎస్ఐ అరుణ్‌కుమార్ సిబ్బందితో ఘటన స్థలానికీ చేరుకుని పరిసరాలను పరిశీలించి అనుమానంతో బావిలో నుండి నీటిని ఇంజన్ ద్వార తీయించడంతో అమరేందర్ మృతదేహం లభించింది. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దార్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చరణ్ కుటుంబాన్ని ఆదుకోవాలి

**యాచారం నవంబర్10, ప్రభాతవార్త....** సాగర్ రోడ్ తుమ్మలోనిగూడ గేటు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చరణ్ కుటుంబానికి న్యాయం చేయాలంటే యాచారం మండల పరిధిలోని తక్కలపల్లి గేటు వద్ద గ్రామస్తులు బంధువులు ఆదివారం ధర్నా నిర్వహించారు. ప్రమాదం జరిగి 24 గంటలు గడుస్తున్న కారు డ్రైవర్ ఇప్పటికి స్పందించకపోవడం పై గ్రామస్తులు బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని లేదంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. పోలీసుల నిర్లక్ష్యం వలననే నిందితుడు స్పందించడంలేదని యాచారం మండలం బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పాశ్చ భాష ఆవేదన వ్యక్తం చేశారు. యాచారం సీఐ నరసింహారావు సంఘటన స్థలానికి చేరుకొని చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబానికి న్యాయం చేసేందుకు కృషి చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**కేశంపేట నవంబర్ 10 ప్రభాతవార్త** కేశంపేట మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామానికి చెందిన నాగిళ్ల మైసమ్మ అనారోగ్యంతో మరణిం చారు. గ్రామానికి చిత్రం బి ఆర్ ఎస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్గాల లక్ష్మీనారాయణ గౌడ్ మానవత్వంతో స్పందించి, మైసమ్మ కుటుం బానికి ఆదివారం రూ. 5000 వేల రూపాయలను గ్రామ టిఆర్ఎస్ పార్టీ నాయకులు వారి కుటుంబానికి రూ. 5000 ఆర్థిక సాయం అందజేశారుఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సావిత్రి బాలరాజ్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ రామ్ రెడ్డి, మాజీ ఎంపిటిసి యాదయ్య, నాగిళ్ల బాలయ్య, కందిన లక్ష్మయ్య, వార్డు సభ్యులు అంతారం నరసింహ పాల్గొని మైసమ్మ కుటుంబానికి మద్దతు తెలిపారు.

## ప్రజలు కుల గణన సర్వేకి సహకరించాలి

దుద్యాల్,నవంబర్ 10, ప్రభాతవార్త: మండల కేంద్రంలో రెండవ రోజు కులగణన సర్వే కొనసాగుతుంది. సర్వే సరళిని దుద్యాల మండల ఎంఈఓ కులగణన సర్వే సూపర్ వైజర్ విజయరామారావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్యూమరేటర్ సంపత్ పాల్గొన్నారు.

## నేడు కరెంటు సరఫరాకు అంతరాయం

**శంషాబాద్. నవంబర్ 10. ప్రభాతవార్త.** సోమవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3.గంటల వరకు మల్కారం విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో కొత్త లైన్ ఏ.బి స్విచ్ నిర్మాణం కోసం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఎడిఈ శ్రీనివాసులు తెలిపారు. మల్కారం విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలోని మల్కారం ,నానాజీపూర్ ,రాయన్నగూడ ,కవెలిగూడ ,రామాంజపురం. బోటిగూడ గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని సూచించారు.

## ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వాలు పునస్సమీక్షించుకోవాలి

### జై భీం యూత్ అధ్యక్షులు మరాటి వివేక్

**యాచారం, నవంబర్ 10, ప్రభాతవార్త** సుప్రీమ్ కోర్ట్ ఎస్సి వర్గీకరణ పై ప్రకటన చేసిన వ్యతిరేకిస్తూ ఇబ్రహీంపట్నం శాస్త్ర గార్డెన్ లో ఏర్పాటు చేసిన మాల, మాల ఉద్యోగస్తుల సమ్మేళనానికి నందివనపర్తి భీం ఎద్యుకేటెడ్ యూత్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం పురస్కరించుకొని అధ్యక్షులు మరాటి వివేక్ మాట్లాడుతూ... వర్గీకరణ అమలు జరిపితే కొన్ని దళిత జాతులు సమూలంగా అంతరించే ప్రమాదముందని, కొన్ని వర్గాలకు తీరని నష్టం కలగడమే కాకుండా క్రిమిలేయర్ వలన విద్య, ఉపాధి, ఆర్థిక రంగాలలో భవిష్యత్తు తరాల ఉనికి ప్రశ్నార్ధకంగా మారబోతుందని అభిప్రాయపడ్డారు. సుప్రీమ్ కోర్ట్ యొక్క పూర్తి తుది తీర్పు సారాంశాన్ని అనుసరించి ముందుగా దళిత బహుజనుల జనాభా నిర్ధారించకుండా కొన్ని రాజకీయ పార్టీలు వారి వోట్ బ్యాంకు రాజకీయాన్ని అవసరానికి అనుగుణంగా మార్చుకుని అంబెడ్కర్ వాదులను దళిత బహుజనులను విడగొట్టే ప్రయత్నాలు మానుకోవాలని అన్నారు .భవిష్యత్తులో మాల ల కార్యాచరణ ఉధృతమవబోతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చేట్టిమల్ల శాంతయ్య,భూపతి సువర్ణభుగ్గరములు, ఉపాధ్యాయులు మరాఠి యాదయ్య, భూపతి ఇస్తారి,కాలే యాదయ్య, భూపతి రవీందర్, తెలుగు మల్ల రవీందర్, తెలుగమలు నరేందర్, మరాటి నరసింహ, పెరమండ్ల రమేష్, మరాఠీ మహేందర్, భూపతి అనిల్ కుమార్, భూపతి గౌతమ్, భూపతి భరత్ తదితరులు పాల్గొన్నారు.

## ముచ్చర్ల గేటు వద్ద కారు బోల్తా .. ఇద్దరు మృతి

**యాచారం,నవంబర్10, ప్రభాత వార్త..** శ్రీశైలం డ్యాం చూడడానికి వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో కారు బోల్తా పడి ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన హైదరాబాద్ గ్రీన్ ఫార్మసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. సిఐ కృష్ణంరాజు తెలిపిన వివరాలు ప్రకారం.. పహడీషరీఫ్ కి చెందిన ఇంతియాజ్ ఖాన్, (18) నాయబ్, (18) లు స్నేహితులతో కలిసి మెహిందీపట్నం లోని ఒక ట్రావెల్స్ లో కారును అద్దెకు తీసుకొని శ్రీశైలం, డ్యాం చూడడానికి వెళుతుండగా మార్గమధ్యంలో శ్రీశైలం హైవే ముచ్చర్ల గేటు వద్దకు చేరుకోగానే కారు అదుపుతప్పి బోల్తా పడడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. కారు నడుపుతున్న అబ్దుల్ సమీర్, మరో ఐదు మందికి స్వల్పంగా గాయపడ్డారు. మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## దాడికి పాల్పడ్డ నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

**కేశంపేట, నవంబర్ 10 ప్రభాతవార్త** శంషాబాద్ మండలంలోని జుక్కల్ గ్రామంలో గ్రామ దేవతల గుడిపై జరిగిన దాడిని నిరసిస్తూ, దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అయ్యప్ప స్వాములు కేశంపేటలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వాములు తిరుమలయ్య గౌడ్, అమరేష్ యాదవ్, పాండు గౌడ్, పవన్ కుమార్ రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి, గ్రామస్థులు రమణ గౌడ్, బైకని శేఖర్, పోలేమోని సతీష్, జాలపల్లి అనసూయ, మంగలి శంకర్, మంచే యాదయ్య, పాండు, బోగ దశరథ్ యాదవ్, బ్రహ్మాచారి, టి.పాండు గౌడ్, శివ గౌడ్, రామాంజనేయులు పాల్గొన్నారు. మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజే కేశంపేట నవంబర్ 10 ప్రభాతవార్త: కేశంపేట మండల పరిధిలోని సంఘం గ్రామానికి చెందిన చాకలి జంగయ్య అనారోగ్యంతో మృతి చెందారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న తాజా మాజీ జెడ్పిటిసి విశాల శ్రవణ్ రెడ్డి మృతుని కుటుంబానికి 5000 రూపాయలను ఆర్థిక సాయం గా గ్రామా కాంగ్రెస్ నాయకుల ద్వారా ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇబ్రహీం కుమ్మరి నవీన్ కుమార్, చాకలి రమేష్, సద్దాం, సల్మాన్, నరసింహ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

**తలకొండపల్లి, నవంబర్ 10, ప్రభాతవార్త :** తలకొండపల్లి మండలంలోని చంద్ర ధన గ్రామములో ఏర్పాటుచేసినపేపర్ ప్లేటు పరిశ్రమను కాంగ్రెస్ నాయకులు. మాజీ ఎంపీటీసీ. రాములు్చ.రాజేందర్ రెడ్డి.భకీ రఘు. బండల రవీందర్ రెడ్డి. చాకలి అంజయ్య. సందర్శించినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఏర్పాటు చేసిన కుటీర సంతోష యాదగిరి మాట్లాడుతూ. తక్కువ ధరకే పేపర్ ప్లేట్స్ హోమ్ డెలివర్ చేస్తామని వారు తెలిపారు కావలసినవారు నా ఫోన్ నెంబర్. 9912178160.ద్వారా సంప్రదించాలనివారు తెలిపారు.

## భారత దేశం అన్ని రంగాల్లో అభివృ చేందుతుంది

### ఆర్ఎస్ఎస్ బెంగాల్ కన్వీనర్ ఈశ్వర్ వెల్లడి

**చేవెళ్ళ, నవంబర్ 10, ప్రభాతవార్త** భాతర దేశం అన్ని రంగాల్లో అభివృద్ది పథంలో ముందుకు దుసుకు వెళ్తుందని ఆర్ఎస్ఎస్ బెంగాల్ కన్వీనర్ ఈశ్వర్ వెల్లడించారు.దత్తాపంచ్‌జీ జయంతి సందర్బంగా ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలోని వివేకానంద కళాశాలలో అయన చిత్రపటానికి పూలమాలలు వెసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్బంగా ఆర్ఎస్ఎస్ బెంగాల్ కన్వీనర్ ఈశ్వర్ మాట్లాడుతూ భారత దేశం 500 ఎళ్ల క్రితం స్వయం సమృద్ది దేశంగా ఉండేదని, కాలక్రమంగా దేశం ఇతర దేశాలపై అదారపడాల్సిన పరిస్దితి ఏర్పడిందని, స్వదేశి ఉత్పత్తులు తయారీ రంగం రోజు రోజుకు పేరుగుతుందన్నారు. ప్రస్తుతం కరోనా వ్యాక్సీన్ తయారీ నుండి ఇతర దేశాలకు యుద్ద పరికరాలను స్వయంగా తయారు చేసి అమ్మెస్దిదికి ఎదిగిందన్నారు. దేశం అన్ని రంగాల్లో ముందుకు దుసుకువెల్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు స్వయం సమృద్దిని సాధించి దేశ ఆర్ధిక అభివృద్దికి తమ వంతు సహకారం అందించాలన్నారు. పాలమూరు,రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ అదారిత గ్రామాలు ఎక్కడ ఉన్న వ్యవసాయ ఉత్పత్తులను పెంచి వాటి ద్వారా బై ప్రాడక్ట్సను తయారు చేసి ఆర్దికంగా గ్రామాల అభివృద్ది జరిగినప్పుడే రాష్ట్రం, దేశం అభివృద్ది చేందుతుందన్నారు. వ్యాపార రంగాల్లో యువకులు ముందుకు రావాలన్నారు.

## మున్సిపల్ అభివృద్ధికి దాతలు సహకారం అందించాలి: చైర్మన్

**ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 10, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం హర్షణీయమని చైర్మన్ బి. కొండల్ రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ సూర్యనగర్ కాలనీలో దాదాపు ఒక లక్షా రూపాయలతో నిర్మించిన భూగర్భడ్రైనేజీని ఆదివారం చైర్మన్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ దాతల సహాయంతో దాదాపు 50 మీటర్ల వరకు భూగర్భడ్రైనేజీని నిర్మించినట్లు తెలిపారు. మున్సిపల్ అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహకారం అందించి తోటివారికి సహకారం అందించాలని అన్నారు. అనంతరం కాలనీవాసులకు జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు నర్సింహులు, ఆనంద్ రెడ్డి, సాయి, శ్రీనివాస రావు, యాదగిరి, షకీల్, రుక్మారెడ్డిలను చైర్మన్ శాలువ కప్పి సత్కరించారు. కాలనీవాసులు జయలక్ష్మి, రూప తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కుల గణన హర్షణీయం

### -చేవెళ్ల మండల కాంగ్రేస్ పార్టీ ఉపాధ్యక్షురాలు గోనే సరితాప్రతాప్‌రెడ్డి

**చేవెళ్ళ, నవంబర్ 10, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కుల గణన కార్యక్రమం హర్షణీయమని, ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కులగణన చేపట్టి బిసిలకు న్యాయం చేడడమే ప్రభుత్వ లక్ష్మమని చేవెళ్ల మండల కాంగ్రేస్ పార్టీ ఉపాధ్యక్షురాలు గోనే సరితాప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చేవెళ్ల మండల కాంగ్రేస్ పార్టీ ఉపాధ్యక్షురాలు గోనే సరితాప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ బిసిలలో 100కు పైగా సబ్ కులాలు ఉన్నాయని, బిసిలకు ఓబిసిలు,ఎస్సీలు, ఎస్టీలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన కుల గణనను పకడ్బందీగా చేపట్టాలన్నారు. బీసీలకు చట్టసభల్లో స్దానం కల్పించేందుకు ప్రణాళికలు చేస్తుందన్నారు. బిసిలకు తగిన న్యాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడిందన్నారు. కుల గణనపై అపోహలను విడి ప్రభుత్వం చేపడుతున్న కులగణనకు సహకరించాలన్నారు.

## అయ్యప్ప మహా పడిపూజలో వైస్ చైర్మన్ నరసింహ గౌడ్



అయ్యప్ప మహా పడిపూజలో పాల్గొన్న వైస్ చైర్మన్ నరసింహ గౌడ్

**అమీన్‌పూర్, నవంబర్ 10 ప్రభాతవార్త:** అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం అయ్యప్ప మహా పడిపూజ మహోత్సవంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలపై అయ్యప్ప స్వామి కృప, దీవెనలు తప్పక ఉంటాయని తెలిపారు. ప్రజలు సుఖ సంతోషాలతో స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం శెట్టి బలిజ గౌడ్ సంఘం మన భోజనం మహోత్సవానికి మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఉపేందర్ రెడ్డి, బాసెట్టి కృష్ణ, కొల్లూరి మల్లేష్, నందారం రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాలు ప్రశాంతతకు నిలయాలు

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**కేశంపేట నవంబర్ 10 ప్రభాతవార్త** కేశంపేట మండల పరిధిలో లేమామిడి గ్రామంలో నిర్వహించిన శ్రీ కార్యసిద్ధి రామాంజనేయ స్వామి ఆలయ మొదటి వార్షికోత్సవ వేడుకలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని గ్రామాలలో వెలసిన ఆలయాలు ప్రశాంతతకు నిలయాలని ప్రతి ఒక్కరు దైవాంఛతనం కలిగి ఉండాలని ఆయన అన్నారు. వచ్చిన భక్తులకు అన్న విస్తరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన సీనియర్ నాయకు ఎలాగమోని యాదయ్య, కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షులు గూడ వీరేశం,జగదీశ్వర్,యువజన కాంగ్రెస్ నాయ కులు భాస్కర్ ,సురేష్ రెడ్డి,శ్రీధర్ రెడ్డి,కరుణాకర్ రెడ్డి,గిరి యాదవ్, రమేష్, రంరెడ్డి,పెంటయ్య,రూప్ల నాయక్, రాజేష్,మహిళా నాయకురాలు అనసూయ అఖిల్,రాజేందర్,రాములు,ప్రకాశ్ గౌడ్,యధగిరి, శ్రీనాథ, వెంకటేష్, గోపాల్ ,పర్వతాలు,భాస్కర్ రెడ్డి,శేసి వర్ధన్ అంజేయులు, రఘుపతి, సుందరయ్య,అమీర్,పండు,నర్సింహ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్

**కేశంపెట నవంబర్ 10 ప్రభాతవార్త** మత్స్యకారులు ఆర్థికంగా అన్ని విధాల అభివృద్ధి చెందాలని రాష్ట్ర ప్రభుత్వం 100 సబ్సిడీతో ఆదివారం మండల పరిధిలోని పలు గ్రామాలకు నాలుగు లక్షల చేప పిల్లలను మత్స్యకార సొసైటీలకు చేప పిల్లలను పంపిణీ చేసే కార్యక్రమానికి షాద్ నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ హాజరై చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు చేప పిల్లలను 100 సబ్సిడీతో ఉచితంగా అందిస్తుందని వీటిని చెరువులలో కుంటలలో వదులుకొని మంచి దిగుబడిని సాధించి ఆర్థికంగా నిలదుకుకోవాలని ఆయన మత్స్యకారులకు సూచించారు ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్య యాదవ్, మండల అధ్యక్షుడు వీరేశం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వరప్ప, నేతలు శశివర్ధన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, గిరి యాదవ్, రావుల పెంటయ్య ముదిరాజ్, వింజమూరు వెంకటయ్య ముదిరాజ్, శ్రీశైలం ముదిరాజ్, అందే మోహన్, సీతారాములు పాల్గొన్నారు.



# రోడ్డుపక్కనే చెత్త..ఇట్లాయితే ఎట్లా...

### పొగ,దుర్వాసనతో వాహనాదారులకు ఇబ్బందులు

### అధికారులు పట్టించుకోవాలి వాహనాదారులు

**దూల్మిట్ట, నవంబర్ 10, ప్రభాతవార్త** అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శనిఉన్నట్లు (సామెత) తెలంగాణ ప్రభుత్వం ప్రతి గ్రామంలో చెత్తా డంపింగ్ యార్డు ఏర్పాటు చేసింది.ఎక్కడ పడితే అక్కడ చెత్తవేసి కాలష్యం చేసి పర్యావరణానికి నష్టం వాటిళ్ళకుండా చూడాలని అధికారులు తెలుపుతున్నా కొంత మంది కిందిస్థాయి అధికారులు,సిబ్బంది ఆచరణలోకి తేవడం లేదు.ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతీల్లో ట్రాక్టర్లతో పాటు తగినంత సిబ్బంది ఉండేలా చర్యలు చేపట్టింది.కాని దూల్మిట్ట మండలం జాలపల్లి గ్రామపంచాతి అధికా రుల నిర్లక్ష్యం కారణంగా సిబ్బంది ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చలేక పోతున్నారు. ప్రతి రోజు ఉదయాన్నే ఇంటింటా చెత్తను సేకరించి తడి,పొడి చెత్తను వేరి చేసి గ్రామ శివార్లో నిర్మించిన డంపింగ్ యార్డుల్లో వేసి వ్యర్ధాలను ఎరువులుగా తయారు చేసేలా ప్రభుత్వం అధికారులకు తెలుపుతున్నా అందుకు కింది స్థాయి అధికారులు,సిబ్బంది తప్పుదోవపట్టిస్తున్నారు. జాలపల్లి గ్రామం మీదుగా నంగునూరు,హుస్నాబాద్,సిద్దిపేటకు వెళ్తుంటారు.అయితే రోడ్డు పక్కనే చెత్తను దంపు చేసి కాల్చీవేయడంతో



రోడ్డు పక్కనే చెత్తకు నిప్పు అంటించడంతో పొగ వస్తున్న దృశ్యం

నిత్యం ఈ దారివెంబడి వెళ్ళె వాహనాదారులు ఇబ్బందులకు గురవ్వడమే కాక రోగాల పాలయ్యే పరిస్థితి ఉందని పలువురు ఆరోపిస్తున్నారు.జిల్లా అధికారులు ప్రజల ఆరోగ్యా న్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టి,రోడ్డు పక్కా న చెత్తను దంపుచేయకుండా చూడాలని ప్రజలు,వాహనాదారులు కోరుతు న్నారు.